పప్పుశనగ విత్తన ధరలు ఖరారు

25 శాతం రాయితీతో పంపిణీ

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: ఉమ్మడి అనంత జిల్లాలోని నల్లరేగడి నేలల్లో రబీలో సాగు చేసే రైతులకు రాయితీతో పంపిణీ చేసే పప్పుశనగ విత్తన ధరలు ఖరారయ్యాయి. 25 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సోమవారం వ్యవసాయశాఖ కమిషనర్ డిల్లీరావు ఉత్తర్వులు జారీ చేశారు. జేజీ-11, కేఏకే-2 కాబూలి రకం విత్తనాలు మంజూరయ్యాయి. అనంతపురం జిల్లాకు 27,139 క్వింటాళ్లు, శ్రీసత్యసాయి జిల్లాకు 1,143 క్వింటాళ్లు కేటాయించారు. జేజీ-11 విత్తనం ధర కిలో రూ.94 కాగా రూ.23.50 రాయితీ పోను మిగిలింది చెల్లించాలి. కేఏకే-2 కాబూలి రకం ధర కిలో రూ.120 కాగా రూ.30.25 రాయితీ ఇవ్వనున్నారు. ఒక్కో రైతుకు గరిష్ఠంగా ఐదెకరాలకు 10 బస్తాలు (బస్తాకు 20 కిలోలు) చొప్పున రాయితీ పప్పుశనగ విత్తనం పంపిణీ చేయనున్నట్లు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వ్యవసాయాధికారులు ఉమామహేశ్వరమ్మ, సుబ్బారావు తెలిపారు.

టెట్ అభ్యర్థులు 44,855

3 నుంచి పరీక్షలు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లు ఈ నెల 3 నుంచి 21వ తేదీ వరకూ జరుగుతాయని డీఈవో వరలక్ష్మి తెలిపారు. అనంతపురంలో 6 కేంద్రాలు, తాడిపత్రి 2, గుత్తి 1, బెంగళూరులో 3 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లా నుంచి 44,855 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. అభ్యర్థులు హాల్‌టికెట్, గుర్తింపు కార్డుతో గంటన్నర ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అక్రమాల నిగ్గు తేలేనా?

- పీఏసీఎస్‌ల్లో దస్త్రాల కంప్యూటరీకరణపై మల్లగుల్లాలు
- అవినీతి దందా బయటపడుతుందనే ప్రక్రియ ఆలస్యం


ఆన్‌లైన్ అయ్యేనా..



గతేడాది కనగానపల్లి పీఏసీఎస్ పరిధిలో అక్రమాలు చోటు చేసుకున్నాయి. రామగిరి మండలానికి చెందిన రైతు తాను తీసుకున్న రూ.4 లక్షల అప్పును కట్టేశారు. అప్పటి పీఏసీఎస్ సీఈవో.. రైతుతో తెల్ల కాగితాలపై సంతకాలు చేయించుకున్నారు. డబ్బును బ్యాంకులో డిపాజిట్ చేయకుండా సొంతానికి వాడుకున్నారు. తర్వాత రైతు విషయం తెలుసుకుని ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చింది. సీఈవో నుంచి రికవరీ చేసి.. ఎలాంటి చర్యలు తీసుకోకుండానే వదిలేయడం గమనార్హం.



కూడేరు సొసైటీ పరిధిలో నకిలీ పాసు పుస్తకాలు పెట్టి పెద్ద మొత్తంలో రుణాలు పొందారు. ఇందుకు సొసైటీ అధికారులు సహకరించారు. కూడేరులో ఒకే కుటుంబానికి 22 రుణాలు ఇచ్చారంటే ఏస్థాయిలో అవినీతి జరిగిందో అర్థం చేసుకోవచ్చు. సొసైటీ సభ్యులు షేర్ క్యాపిటల్‌గా ఇచ్చిన సొమ్మును సైతం సొంతానికి వాడుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఎన్‌పీఏగా మారిన వ్యక్తుల వారసులకు రుణాలు మంజూరు చేయడం వంటి అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో సీఈవో రాజీనామా చేసి వెళ్లిపోవడం గమనార్హం.



ఈనాడు డిజిటల్, అనంతపురం, న్యూస్‌టుడే, ఉరవకొండ

ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (పీఏసీఎస్) దస్త్రాల కంప్యూటరీకరణ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయితే తాము చేసిన అక్రమాలు బయటపడతాయనే భయంతో ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేస్తున్నారు. అక్టోబరు 2తో గడువు ముగుస్తోంది. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలోని ఒక్క సొసైటీలోనూ ప్రక్రియ పూర్తికాలేదు. మరికొన్నింటిలో పనే మొదలుపెట్టకపోవడం గమనార్హం. సాంకేతిక కారణాలను చూపి కంప్యూటరీకరణ ముందుకు సాగకుండా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అన్నీ ఉన్నా..

ఉమ్మడి జిల్లాలో ఒక్కో సొసైటీకి కంప్యూటర్, ప్రింటర్, స్కానర్, ఈ-పాస్ మిషన్‌తోపాటు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించారు. కంప్యూటరీకరణకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి తీసుకొచ్చారు. గతేడాది ఆరంభంలో ప్రక్రియ మొదలుపెట్టాలని కేంద్రం ప్రభుత్వం చెప్పినా అప్పటి వైకాపా సర్కారు నిర్లక్ష్యం చేస్తూ వచ్చింది. వైకాపా నాయకుల అక్రమాలు బయటపడతాయని కనీసం పరికరాలను బయటకు తీయలేదు. తెదేపా కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని పీఏసీఏస్‌లలో కంప్యూటర్లను బయటికి తీశారు. ఏడీసీసీ బ్యాంకు ఉన్నతాధికారులు సైతం ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడంలో నిర్లక్ష్యం చూపుతున్నారు. ఇటీవల కలెక్టర్ ఆదేశించినా పరిస్థితిలో మార్పు రావడం లేదు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

మొత్తం సహకార సంఘాలు	118
వివిధ రకాల రుణాలు	రూ.1,300 కోట్లు
బకాయిలు	రూ.130 కోట్లు
డిఫాల్ట్ అయిన సొసైటీలు	70
కంప్యూటరీకరణ పూర్తయినవి	0
తుది గడువు	అక్టోబరు 2

విడతల వారీగా పూర్తి చేస్తాం

- వినోద్‌కుమార్, కలెక్టర్, అనంతపురం

పీఏసీఎస్‌ల్లో కంప్యూటరీకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని ఏడీసీసీ బ్యాంకు అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. అక్టోబరు 2 నాటికి మొదటి విడత పూర్తి చేస్తాం. క్షేత్రస్థాయిలో కొన్ని సాంకేతిక సమస్యలు ఉన్నట్లు అధికారులు మా దృష్టికి తీసుకొచ్చారు. విడతల వారీగా ఆన్‌లైన్ ప్రక్రియ చేపడతాం.



అర్జీలు పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

మండల స్థాయిలోనే సమస్యలు పరిష్కరించాలి

తపోవనం(అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరిస్తున్న అర్జీలను వేగంగా పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. మండలస్థాయి సమస్యలను అక్కడికక్కడే పరిష్కారం చేస్తే జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం ఉండదని ఆయన అన్నారు. సోమవారం అనంతపురం రెవెన్యూ డివిజన్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం డీఆర్‌డీఏ కార్యాలయంలో నిర్వహించారు. మొత్తం 205 అర్జీలు స్వీకరించారు. కలెక్టర్‌తో పాటు సంయుక్త కలెక్టర్ శివనారాయణ్ శర్మ, సహాయ కలెక్టర్ బి.వినూత్న తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు. అధికారులు ప్రతివారం అర్జీల పరిష్కారంపై సమీక్షించుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన 100 సేవలకు సంబంధించి మున్సిపాల్టీలు, తహశీల్దారు, ఎంపీడీఓ కార్యాలయాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అర్జీల పరిష్కారంలో రాష్ట్రంలోనే జిల్లా మూడో స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వసంతబాబు, జడ్పీ సీఈఓ ఓబుళమ్మ, వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, ట్రాన్స్‌కో ఎస్ఈ సంపత్‌కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారి తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు. భూ సమస్యలపైనే ఎక్కువగా అర్జీలు వచ్చాయి. కలెక్టర్ కార్యాలయ రెవెన్యూ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి 122 అర్జీలను స్వీకరించారు.


ఉమ్మడి జిల్లాలో 223 మద్యం దుకాణాలకు ప్రకటన

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: కొత్త మద్యం విధానం నేటి (మంగళవారం)నుంచి అమల్లోకి రానుంది. మద్యం దుకాణాలకు నోటిఫికేషన్, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య వెల్లడించారు. సోమవారం అనంతపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అక్టోబరు 1 నుంచి 9 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆన్‌లైన్ లేదంటే ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేయవచ్చన్నారు. ఆన్‌లైన్‌కు సంబంధించి ప్రత్యేక యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానుందన్నారు. నేరుగా దరఖాస్తులు సమర్పించే వారికి ఉమ్మడి అనంత జిల్లాలోని 18 ఎక్సైజ్ స్టేషన్లలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. సచివాలయం నుంచి డిజిటల్ అసిస్టెంట్, బ్యాంకు ఉద్యోగి అందుబాటులో ఉండి సహకరిస్తారన్నారు. టెండరు ప్రక్రియ ఈనెల 11తో పూర్తి అవుతుందని, 12 నుంచి కొత్త దుకాణాలు అందుబాటులోకి వస్తాయని డీసీ వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, అసిస్టెంట్ సూపరింటెండెంట్‌లు శ్రీరామ్, రేవతి సుబ్రహ్మణ్యం, ఇన్‌స్పెక్టర్ జయనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుగృహం

- పక్కా ఇళ్లు పూర్తికి బృహత్తర ప్రణాళిక
- 'మన ఇల్లు.. మన గౌరవం'లో లబ్ధిదారులకు అవగాహన



రాయదుర్గం పట్టణంలో అసంపూర్తిగా గృహ నిర్మాణాలు

రాయదుర్గం, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద(పీఎంఏవై) మంజూరైన ఇళ్ల నిర్మాణాల పూర్తికి కూటమి ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. 'మన ఇల్లు.. మన గౌరవం' పేరిట అధికారులను లబ్ధిదారుల వద్దకు పంపి చైతన్యపరుస్తోంది. ఒక్కో అధికారికి రెండు కాలనీల బాధ్యతలు అప్పగించింది. అనంతపురం జిల్లాలో పునాది నుంచి లింటెల్ స్థాయిలో ఇళ్లను 2025 మార్చిలోగా పూర్తి చేయాలి. స్లాబు స్థాయి/ స్లాబు వేసిన వాటిని ఈఏడాది అక్టోబరులోగా పూర్తి చేయాల్సి ఉంటుంది.


నిధులు కేంద్రానివి.. ప్రచారం వైకాపాది

పీఎంఏవైలో మంజూరైన ఇళ్ల నిర్మాణానికి అయ్యే ఖర్చంతా కేంద్ర ప్రభుత్వమే భరిస్తోంది. గత వైకాపా ప్రభుత్వం ఈ ఇళ్లకు జగనన్న కాలనీల బోర్డులు తగిలించి తామే ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంది. గతంలో మంజూరైన ఇళ్లు పూర్తి కాకుంటే వచ్చే ఏడాది కేంద్రం కొత్తవి మంజూరు చేసేందుకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం లబ్ధిదారులతో మాట్లాడి గృహ నిర్మాణాలు పూర్తి చేయించాలని ఆదేశించింది.

సమాచారం సిద్ధం

అసంపూర్తి ఇళ్ల జాబితాను అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు. ఏ మండలంలో ఎన్ని ఉన్నాయనే దానిపై సమగ్ర సమాచారం సేకరించారు. ఇందుకోసం సచివాలయానికి ఓ నోడల్ అధికారితో బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరు లబ్ధిదారులతో మాట్లాడి కారణాలు తెలుసుకుంటున్నారు. అందుబాటులో ఉన్న నిర్మాణదారులను తక్కువ ధరకు పని చేసేలా మాట్లాడటం, సామగ్రి తక్కువ ధరకు ఇప్పిస్తారు.

పీఎంఏవై ఇళ్ల నిర్మాణాల వివరాలు



మంజూరైన మొత్తం ఇళ్లు	3.50లక్షలు
పీఎంఏవై కింద మంజూరైనవి	82,159
పూర్తయినవి	32,991
వివిధ దశల్లో ఉన్నవి	30,904
మొదలు కానివి	18,264

పూర్తి చేయకుంటే కష్టమే..

గతంలో ఇంటి పని మొదలు పెట్టి పూర్తి చేయని వాటి గడువు త్వరలోనే ముగియనుంది. ఇలాంటి వారంతా భవిష్యత్తులో బిల్లులు నష్టపోతారు. కొత్త పథకానికి అర్హత ఉండదు. లబ్ధిదారులు నష్టపోకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

సంఘాల ద్వారా రుణాలు

- ఎం.శైలజ, హౌసింగ్ పీడీ, అనంతపురం

జిల్లాలో వివిధ దశల్లో ఆగిన ఇళ్లకు స్వయం సహాయక సంఘాలు లేదా బ్యాంకర్ల ద్వారా రుణాలు మంజూరు చేయిస్తాం. రాష్ట్రంలో పీఎంఏవైలో మంజూరైన నిధులను వినియోగిస్తే తప్ప కొత్త నిధులు రావు. గతంలో మంజూరైన నిధులు వచ్చే ఏడాది మార్చికల్లా వెనక్కి వెళ్లిపోతాయి. అసంపూర్తి గృహ నిర్మాణాలకు సిమెంట్, నిర్మాణ సామగ్రి, ఇసుకను ప్రభుత్వమే సరఫరా చేస్తుంది.

పథకం కేంద్రానిది.. ప్రచారం వైకాపాది!



రాప్తాడు గోదాములో మూలకు చేరిన బోర్డులు

కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. తెల్లకార్డుదారులందరికీ ఉచితంగా బియ్యం పంపిణీ చేయాలన్నదే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. అందులో భాగంగానే 'మోదీ ప్రభుత్వం ఇస్తున్న భరోసా.. అందరికీ ధాన్యం ఆరోగ్యవంతమైన సమాజం' పేరుతో భారత ప్రభుత్వం వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వశాఖ ద్వారా ఫ్లెక్సీలు తయారు చేయించి ఉమ్మడి జిల్లా పౌరసరఫరాల శాఖకు పంపారు. కార్డుదారులకు తెలిసేలా ప్రతి చౌక దుకాణంలో వాటిని తగిలించాలి. అలాకాకుండా ఉమ్మడి జిల్లాలోని 24 మండల లెవెల్ స్టాక్ పాయింట్ల(ఎంఎల్ఎస్)లో ఫ్లెక్సీలను మూలన పడేశారు. వైకాపా ప్రభుత్వం జగన్‌మోహన్ రెడ్డి పేరుతో ఉన్న ఫ్లెక్సీలు తయారు చేయించి చౌక దుకాణాలకు తగిలించారు. అప్పట్లో ఉచిత బియ్యం కేంద్రమిస్తే.. వైకాపా నాయకులు తమ పేర్లు చెప్పుకోవడాన్ని భాజపా నాయకులు పూర్తిగా తప్పుబట్టారు. ఆందోళనలు సైతం చేశారు. దీనిపై అనంతపురం జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ రమేశ్‌రెడ్డిని వివరణ కోరగా ఫ్లెక్సీలను చౌక దుకాణాలకు సరఫరా చేశాం. మిగిలినవి గోదాముల్లో ఉన్నాయని చెప్పారు.

- న్యూస్‌టుడే, అనంతపురం (కళ్యాణదుర్గం రోడ్డు)

సెక్టోరియల్ పోస్టులకు పైరవీలు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: సమగ్రశిక్షా పథకంలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టుల నియామకంలో పైరవీలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. ఖాళీగా ఉన్న ఏఎంఓ, అసిస్టెంట్ ఏఎంవో, జీసీడీవో, అసిస్టెంట్ సీఎంవో, అసిస్టెంట్ అలెస్కో, ఐఈడీ కోఆర్డినేటర్, ఏఎస్ఓ పోస్టులను ఫారిన్ సర్వీసు కింద నియమించడానికి ప్రకటన జారీ చేశారు. పై పోస్టులు అర్హులైన ఉపాధ్యాయుల ద్వారా భర్తీ చేస్తారు. మూడేళ్లపాటు జిల్లా కేంద్రంలోని సమగ్రశిక్షా కార్యాలయంలో పని చేయాల్సి ఉంటుంది. శివారు మండలాలు, దూరంగా ఉన్న పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు వీటి కోసం పోటీ పడుతున్నారు. పోస్టు దక్కించుకుంటే అధికారంతో పాటు వాహన సదుపాయం కల్పిస్తారు. పాఠశాలకు వెళ్లే అవసరం ఉండదు. ఆ భావనతో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టుల కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు తమదైన శైలిలో ఒత్తిళ్లు చేయిస్తున్నారు. ఈ పోస్టుల భర్తీలో ముడుపుల బాగోతం జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. విద్యాశాఖకు చెందిన కొందరు ఉద్యోగులు మధ్యవర్తిత్వం నడపుతున్నట్లు సమాచారం.



సమగ్రశిక్షా కార్యాలయం

నేడు మౌఖిక పరీక్షలు

సెక్టోరియల్, సహాయ సెక్టోరియల్ పోస్టులు మొత్తం 8 భర్తీ చేస్తున్నారు. వాటికి 110 దరఖాస్తులు వచ్చాయి. వాటిని గత ఆగస్టు 30న ప్రత్యేక బృందాలు పరిశీలించాయి. అందులో 14 మందికి మాత్రమే అర్హత ఉన్నట్లు తేల్చారు. వారికి సెల్‌ఫోన్ ద్వారా సమాచారం పంపారు. మంగళవారం సమగ్రశిక్షా కార్యాలయంలో మౌఖిక పరీక్షలు నిర్వహించనున్నారు. గతంలో నోటీసు బోర్డులో అర్హుల జాబితా ప్రకటించేవారు. మౌఖిక పరీక్షలపై ఎలాంటి సమాచారం బయటకు పొక్కకపోవడంతో అనుమానాలు తలెత్తుతున్నాయి. ప్రకటనలో పేర్కొనని అంశాలను తెరపైకితెచ్చి అనర్హులుగా చేశారని కొందరు దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుంటాం

- వరలక్ష్మి, డీఈవో, అనంతపురం

అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు బృందాలను నియమించారు. వారు ధ్రువీకరించిన ప్రకారం అర్హులను గుర్తించాం. ఏవైనా అభ్యంతరాలు ఉంటే పరిగణిస్తున్నాం. ఇతర ఆరోపణలు మా దృష్టికి రాలేదు. మంగళవారం మధ్యాహ్నం మౌఖిక పరీక్షలు నిర్వహిస్తున్నాం.

మేమున్నాం.. ప్రాణం నిలబెడతాం!

- అందుబాటులో ఆపద్బాంధవులు
- నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

సృష్టిలో ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ దానం చేయగలిగే అవకాశం ఉన్నది రక్తదానం. మిగిలిన ఏ సాయాన్నీ రక్తదానంతో పోల్చలేం. మతం, కులం, ప్రాంతం ఏదైనా.. మానవత్వాన్ని ఎలుగెత్తి చాటే మహాదానమిది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో కొందరు ఆపద వేళ.. మేమున్నామంటూ ఎందరికో పునర్జన్మనిస్తున్నారు. ఎక్కడైనా.. ఎప్పుడైనా రక్తదానానికి సిద్ధమంటున్నారు.



అతివలకు ఆదర్శం మణిప్రియ



హిందూపురం అర్బన్: హిందూపురానికి చెందిన **మణిప్రియ** ఓ ప్రైవేట్ సంస్థలో పని చేస్తున్నారు. ప్రతి మూడు మాసాలకు ఓసారి ప్రభుత్వాసుపత్రిలోని రక్తనిధి కేంద్రంలో స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్నారు. ఇప్పటికే 15 సార్లు ఇచ్చారు. రక్తదానంలోనూ మహిళలు ముందుండాలని ఆమె పిలుపునిస్తున్నారు.

మూడు నెలలకోసారి విధిగా..



తాడిపత్రి: పట్టణానికి చెందిన **తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి** రక్తగ్రూపు బి-పాజిటివ్. ఇప్పటి వరకు 43 సార్లు రక్తదానం చేశారు. రెండు పర్యాయాలు బాధితుల ప్రాణాలు కాపాడారు. ఆ సమయంలో బాధిత కుటుంబసభ్యుల కళ్లల్లో చూసిన ఆనందం ఎంతో సంతృప్తి ఇచ్చిందంటున్నారు. ప్రతి మూడు నెలలకు రక్తం ఇవ్వడం అలవాటుగా మార్చుకున్నారు.

✆ సంప్రదించాల్సిన నంబరు: 94410 12632

యువ రెడ్-ప్లస్



గుత్తి: గుత్తిలో ఉంటున్న 19 మంది యువకులు రెడ్-ప్లస్ రక్తదాతల సంస్థ ఏర్పాటు చేసి ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటున్నారు. స్వచ్ఛందంగా సేవ చేయడానికి వెయ్యి మంది దాతలు ఉండటం విశేషం. ముఖ్యంగా గర్భిణులను కాపాడటమే లక్ష్యంగా సాగుతున్నారు. పదుల సంఖ్యలో మహిళల ప్రాణాలు కాపాడారు. సంస్థ తరఫున సొంత ఖర్చులతో ఏడు వేల మందికి రక్తదానం చేశారు. సంస్థ అధ్యక్షుడు **షేక్షావలి...** తన బంధువులకు రక్తమందక మరణించిన ఘటనతో రక్తదాతగా మార్చాయి. ఉమ్మడి జిల్లాలో తన మిత్రులను రక్తదానానికి ప్రోత్సహిస్తున్నారు.

✆ 98859 81974

ఇద్దరిని కాపాడారు..



ధర్మవరం: పట్టణానికి చెందిన శ్రీనివాసులు రక్తదాన సేవలో తరిస్తున్నారు. రక్త గ్రూపు ఎ-నెగెటివ్. అత్యవసర పరిస్థితుల్లో ఎప్పుడు.. ఎవరు సంప్రదించినా ఆలోచించకుండా వెళ్తుంటారు. ధర్మవరం, అనంతపురం, బత్తలపల్లి ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో తన చరవాణి, చిరునామా వివరాలిచ్చారు. 20 సార్లు రక్తం ఇచ్చారు. ప్రాణాపాయ పరిస్థితుల్లో దాదాపు 18 సార్లు గర్భిణులను ఆదుకున్నారు. మడకశిర, ఉరవకొండలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడితే అనంతపురానికి తీసుకొచ్చారు. రక్తమిచ్చి ప్రాణాలు కాపాడారు.

✆ 94404 94045


131 సార్లు దానం..



గుంతకల్లు: పట్టణానికి చెందిన రెడ్ డ్రాప్ రక్తదాతల సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రహమాన్ 131 సార్లు రక్తదానం చేశారు. రక్తం అందక తన తండ్రి మరణించారని, ఆ పరిస్థితి ఎవరికీ రాకూడదని సంస్థను ఏర్పాటు చేశారు. ఓ సారి ఆపోలో ఆసుపత్రిలో కడపకు చెందిన ప్రదీప్‌కు రక్తం అవసరమొచ్చింది. హైదరాబాద్‌కు వెళ్లి రక్తమిచ్చి ప్రాణాలు కాపాడారు. ఈకోవలోనే ఎంతో మంది గర్భిణులకు ఆపద్బాంధవుగా నిలిచారు.

✆ 96962 22666

అరుదైన గ్రూపుతో ఆదుకుంటూ..



ఉరవకొండ: ఉరవకొండకు చెందిన నిమ్మల వెంకటేశ్ హెల్త్‌అసిస్టెంట్. రక్త గ్రూపు బి-నెగిటివ్. అరుదైన రక్త గ్రూపుగా పరిగణిస్తారు. 39 సార్లు రక్తదానం చేశారు. గర్భిణికి ప్రాణాపాయస్థితిలో రక్తం ఇచ్చి కాపాడారు. గుంతకల్లులో ఓ బాలిక తలసేమియాతో బాధపడేది. ఆరు నెల్లో వరుసగా మూడు సార్లు రక్తమిచ్చారు.

✆ 90143 44413

శిబిరాలు ఏర్పాటు చేసి..



పామిడి: రక్తం సమయానికి అందకపోవడంతో ఓ గర్భిణి చనిపోయిన ఘటన పామిడి అంబేడ్కర్ కాలనీకి చెందిన పీటర్ విజయ్‌ను కదిలించింది. అప్పటి నుంచి ఆ పరిస్థితి రాకూడదని రక్తదాతగా మారారు. 1997లో అబ్దుల్ కలాం స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 98 సార్లు రక్తదానం చేశారు. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి.. దాదాపు 4 వేల రక్తప్యాకెట్లను వివిధ రక్తనిధి కేంద్రాలకు అందించారు.

✆ 99632 96475



వరద బాధితులకు విరాళం

విజయవాడ వరద బాధితుల సహాయార్థం రాష్ట్ర ముతవల్లీల సంఘం రూ.7,86,000 అందించింది. సోమవారం ఈ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షకీల్ షఫీ ఆధ్వర్యంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు చెక్కు అందజేశారు. ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఉబెదుల్ల సాహెబ్, కోశాధికారి సయ్యద్ తాజ్ బాబా సాహెబ్, సభ్యులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, అనంత సంక్షేమం

3 నుంచి దసరా మహోత్సవాలు

కదిరి, న్యూస్‌టుడే: ఖాద్రి నరసింహస్వామి ఆలయంలో ఈనెల 3 నుంచి దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయా అలంకారాల్లో స్వామివారు దర్శనమిచ్చే ఉత్సవాలు ఈనెల 3న మొదలై 12న ముగుస్తాయని పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలి: మంత్రి

పెనుకొండ పట్టణం, న్యూస్‌టుడే: దసరా, దీపావళి పండగలకు ప్రజలందరూ చేనేత వస్త్రాలను ధరించి నేతన్నలకు ఆర్థికంగా దన్నుగా నిలవాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పిలుపునిచ్చారు. ఈసందర్భంగా సోమవారం సాయంత్రం పట్టణంలోని మంత్రి నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం చేనేతలకు అండగా ఉటుందన్నారు. చేనేతలకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. నేటి తరం యువతీ యువకుల అభిరుచులకు అనుగుణంగా చేనేత రంగంలో నూతన డిజైన్లపై కార్మికులకు శిక్షణ ఇస్తున్నాం. కేవలం శిక్షణతో సరిపెట్టకుండా తయారు చేసిన వస్త్రాలకు మార్కెట్ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. గతనెల విజయవాడలో ఏర్పాటుచేసిన వస్త్ర ప్రదర్శనలో రూ.3కోట్ల వ్యాపారం నిర్వహించామన్నారు. పెద్దపెద్ద మాల్స్‌లో సైతం చేనేత స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సవిత

నేటి నుంచి గుంటూరులో ప్రదర్శన

అక్టోబరు 1 నుంచి 14వ తేదీ వరకు రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన గుంటూరులో నిర్వహిస్తున్నామన్నారు. ఈ ప్రదర్శనలో దేశవ్యాప్తంగా 80చేనేత సంఘాలు, సంస్థలు పాల్గొంటున్నాయన్నారు. వీటిలో నూలు చీరలు, పట్టుచీరలు, పావడాలు, దుప్పట్లు, కలంకారీ మొదలగు చేనేత ఉత్పత్తులు అమ్మకం జరుగుతుందన్నారు. గుంటూరు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కానిస్టేబుల్ మంజమ్మకు కాంస్య పతకం

జిల్లా ఎస్పీ రత్న, డీఎస్పీ మహేశ్ అభినందనలు

హిందూపురం, న్యూస్‌టుడే: ఆల్ ఇండియా పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ విభాగం యోగా మహిళా పోటీల్లో హిందూపురం గ్రామీణ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ మంజమ్మ కాంస్య పతకం సాధించారు. చండీగఢ్ రాష్ట్రంలోని బిలాయి పట్టణం అగ్రసేన్ భవనంలో సెప్టెంబరు 23 నుంచి 27 వరకు ఆల్ ఇండియా పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ యోగా మహిళా పోటీల్లో మంజమ్మ పాల్గొని ప్రతిభ కనబరచి మూడో స్థానంలో నిలిచారు. సోమవారం మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ ఆఫీసర్ రేణుకాభిరెడ్డి ఆధ్వర్యంలో డీజీపీ ద్వారకా తిరుమలరావును మర్యాదపూర్వకంగా కలిసి అభినందలు అందుకున్నారు. మంజమ్మ కాంస్య పతకం సాధించి రాష్ట్రస్థాయిలో జిల్లా పోలీస్ ప్రతిష్ఠను పెంచిందని జిలా ఎస్పీ రత్న అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీతో పాటు హిందూపురం డీఎస్పీ కేవీ మహేశ్ మంజమ్మకు అభినందనలు తెలిపారు.



కాంస్య పతకంతో మంజమ్మ

ఎస్కేయూ ఏఐసీకి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ఎస్కేయూ ఆచార్య నాగభూషణరాజు

ఎస్కేయూ: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్(ఏఐసీ)కి 'ఉత్తమ గ్రామీణ ఇంక్యుబేటర్' పురస్కారం దక్కింది. ఇటీవల హైదరాబాద్‌లోని ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా కళాశాలలో జరిగిన అంతర్జాతీయ స్టార్టప్ ఫెస్టివల్‌లో అపోలో హాస్పిటల్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతారెడ్డి ఈ పురస్కారం అందజేశారు. ఎస్కేయూ అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఈడీ ఆచార్య నాగభూషణరాజు ఈ పురస్కారం అందుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్టార్టప్స్ ఏర్పాటుకు కృషి చేసినందుకు ఈ పురస్కారం దక్కినట్లు ఆయన తెలిపారు.

'ఒప్పంద, పొరుగు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి'

అనంతపురం(శ్రీనివాస్‌నగర్): జిల్లాలో అనేక శాఖలు, పరిశ్రమల్లో పని చేస్తున్న ఒప్పంద, పొరుగు ఉద్యోగులను సత్వరమే క్రమబద్ధీకరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండు చేశారు. సోమవారం అనంత నగరంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆ తర్వాత కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఓబులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం అర్హత కలిగిన ప్రతి పొరుగు, ఒప్పంద సేవల ఉద్యోగులను సత్వరమే క్రమబద్ధీకరించి, సమాన పనికి సమాన వేతనం అందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఐడీ చట్టం ప్రకారం 240 రోజులు పని చేసిన కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా తీసుకోవాలన్నారు. అనంతరం డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డికి వినతి అందించారు. సీఐటీయూ నాయకులు నాగేంద్ర, నాగమణి, గోపాల్, రామాంజనేయులు, వెంకటనారాయణ, శివప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

సామాజిక వన విభాగం ఆర్వో పోస్టుల ఎత్తివేత

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలో సామాజిక వన విభాగంలో పనిచేస్తున్న రేంజ్ ఆఫీసర్ల (ఆర్వో) పోస్టులను ఎత్తేశారు. ఇక్కడ పని చేస్తున్న వారిని ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ఈ మేరకు చీఫ్ కన్జర్వేటివ్ అధికారి నాగేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లాలో పనిచేస్తున్న రేంజర్ డేవిడ్‌ను కర్నూలు జిల్లా ఆత్మకూరుకు, శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ రేంజర్ ఉదయదీప్‌ను గుండ్లబ్రహేశ్వరమ్మకు, బుక్కపట్నం రేంజర్ వెంకటసుబ్బుడును చిత్తూరు తూర్పుకు బదిలీ చేశారు. ఆయా పోస్టుల్లో జిల్లా అటవీశాఖ పరిధిలో పనిచేసే రేంజ్ ఆఫీసర్లకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అనంతపురం ఆర్వోగా శ్రీనివాసులు, బుక్కపట్నం ఆర్వోగా శ్రీనివాసరెడ్డి, పెనుకొండ ఆర్వోగా గుర్రప్పకు బాధ్యతలు అప్పగించారు.

సాంకేతిక సహాయకుడి సస్పెన్షన్

బుక్కపట్నం, న్యూస్‌టుడే: మండలంలోని గూనిపల్లి క్లస్టర్‌లో ఉపాధిహామీ పథకంలో సాంకేతిక సహాయకుడిగా పనిచేస్తున్న సికిందర్ జహాపనాపై సస్పెన్షన్ వేటు పడింది. ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపిన మేరకు వివరాలు.. గూనిపల్లి క్లస్టర్ ఉపాధి పథకంలో సాంతికేక సహాయకుడు సికిందర్ జహాపనా పలు అక్రమాలకు పాల్పడ్డారని గ్రామానికి చెందిన ఉద్యాన రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. దీంతో సాంకేతిక సహాయకుడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి.

తెదేపా కార్యకర్తపై వైకాపా వర్గీయుడి దాడి

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన లక్ష్మణస్వామిపై సోమవారం ఎన్జీవో కాలనీ సర్కిల్ వద్ద వైకాపా వర్గీయుడు మల్లికార్జునరెడ్డి దాడి చేశాడు. గాయపడిన లక్ష్మణస్వామిని స్థానికులు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ద్విచక్ర వాహనంలో వెళుతున్న తనపై మల్లికార్జునరెడ్డి దూషణకు దిగి రాయితో తలపై కొట్టాడని బాధితుడు ధర్మవరం 2వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి కాటమయ్య, నాయకులు కొత్తపేట రాఘవ, ఆది, పురుషోత్తంగౌడ్, మంత్రి సత్యకుమార్ కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్ తదితరులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని ఆరా తీశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో తెదేపా ఏజెంటుగా ఉన్నానని, గతంలోనూ మల్లికార్జునరెడ్డి బెదిరింపులకు దిగాడని లక్ష్మణస్వామి ఆరోపించాడు. ఇప్పుడు రహదారిపై వెళుతుండగా దాడి చేశాడని వాపోయాడు. 2వ పట్టణ పోలీసులు మల్లికార్జునరెడ్డిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.



గాయపడిన లక్ష్మణస్వామిని పరామర్శిస్తున్న భాజపా, తెదేపా నాయకులు

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి

యాడికి, న్యూస్‌టుడే : విద్యుదాఘాతానికి గురై ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన యాడికిలో సోమవారం జరిగింది. లాలెప్ప తోటలో ఉంటున్న నాగమ్మ(85) సాయంత్రం ఇంట్లోని మరుగుదొడ్డిలోకి వెళ్లింది. అక్కడ తెగి ఉన్న విద్యుత్తు తీగ గమనించక పోవడంతో, అదికాస్త ప్రమాదవశాత్తు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు.

వేరుసెనగ దిగుబడి భేష్



కళకళలాడుతున్న పంట

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేరుసెనగ పంటను అధిక విస్తీర్ణంలో రైతులు సాగు చేస్తారు. గత రెండేళ్లుగా వర్షాభావంతో పంటను ఎంతో నష్టపోయిన రైతులు ఈసారి మంచి దిగుబడి చవి చూశారు. ముదిగుబ్బ మండలం పొదరాళ్లపల్లి గ్రామానికి చెందిన రైతు నాగేశ్వర మాత్రం ఏటా వేరుసెనగ సాగు చేస్తూ మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. బోరు కింద రెండు ఎకరాల్లో పంట సాగు చేసి 40 క్వింటాళ్ల దిగుబడి సాధించడం విశేషం.



కాయలు చూపుతున్న రైతు

రైతేరాజు

సాగు విధానం: గత జూన్‌లో కదిరి కే-6 రకం వేరుసెనగ విత్తనాలను ఎకరాకు 120 కిలోల చొప్పున శుద్ధి చేసి రెండు ఎకరాల్లో ఇరు సాల సాగు చేశారు. అంతకుముందు భూమిని లోతుగా దున్నిచి పేడ ఎరువులు బాగా వేశారు. విత్తు సమయంలో సూపర్ పాస్ఫేట్, పొటాష్, యూరియా వినియోగించారు. 30 రోజుల తర్వాత తొలి పూత దశలో యూరియా, ఊడలు దిగే సమయంలో వేరుసెనగ మొక్కల దగ్గర జిప్సం చల్లారు. ఆకు పసుపు పచ్చగా మారడం, ఆకు ముడత వ్యాధులకు జింక్ సల్ఫేట్, స్ట్రెప్టో అమ్మం నీటిలో కలిపి పిచికారీ చేశారు. విత్తు వేసింది మొదలు ఎరువులు, మందులు, కూలీ సేద్యం ఖర్చులన్నీ కలిపి రూ.60వేలు పెట్టుబడి పెట్టారు.

రూ.2.64 లక్షల ఆదాయం: వేరుసెనగ సాగులో సాధారణంగా ఎకరాకు 20 నుంచి 30 సంచుల దిగుబడి వస్తుంది. సారవంతమైన భూమితోపాటు రసాయన ఎరువులు బాగా వినియోగించడంతో కాయల పరిమాణం పెరిగి నాణ్యతగా వచ్చాయి. ఇటీవల పంట కోత కోయగా ఎకరాకు 45 సంచుల చొప్పున రెండు ఎకరాల్లో 90సంచులు (ఒక సంచి 46 కిలోలు) దిగుబడి వచ్చింది. సంచి రూ.3,600తో దళారులకు విక్రయించగా రూ.3,24,000 రాబడి వచ్చింది. పెట్టుబడి పోనూ రూ.2,64,000 మిగిలినట్లు రైతు తెలిపారు.

సమస్య-సమాధానం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: పంటల సాగులో ఎలాంటి సందేహాలున్నా రైతులు రేకులకుంట వ్యవసాయ శాస్త్రవేత్త నజీరుద్దీన్ 99665 05285 నంబరుకు ఫోన్ చేసి తగిన సలహాలు, సూచనలు పొందవచ్చు.

సమస్య: రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాం. పంట 30 రోజుల దశలో ఉంది. ఆకులు ఊదా రంగులోకి మారుతున్నాయి. ఎలా నివారించాలి. - శంకర్ (బొందలవాడ)

సమాధానం: మొక్కజొన్న ఆకులు ఊదా రంగులోకి మారితే భాస్వరం లోపం అని గుర్తించాలి. సమస్యను అధిగమించడానికి డీఏపీ 20 గ్రాములు, 19:19:19 ఎరువును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

సమస్య: నాలుగు ఎకరాల్లో వంగ తోట సాగు చేశాం. పంటకు కాయపుచ్చు తెగులు ఆశించింది. నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి. - ఏసయ్య(జంతులూరు)

సమాధానం: వేప మందు 3 మి.లీ, ప్రోఫినో ఫాస్ 2 మి.లీ చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పశు బీమా.. పాడి రైతులకు ధీమా

రాప్తాడు, న్యూస్‌టుడే: పాడి పరిశ్రమ అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. పశువులతోపాటు గొర్రెలు, మేకల తరఫున వాటికి బీమా వర్తింపజేసింది. పశువు మరణించిన రోజుల వ్యవధిలోనే సంబంధిత రైతులకు సాయం అందుతుంది.

ఎంత చెల్లించాలి: పశువులకు బీమా చెల్లింపులో రూ.15 వేలకు రూ.960 ప్రీమియం కట్టాలి. ఇందులో ఎస్సీ, ఎస్టీ రైతులు 80 శాతం రాయితీ అంటే రూ.192 చెల్లించాలి. ఇతరులు 50 శాతం కట్టాలి. నాటు పశువు రూ.15 వేలు, మేలుజాతి పశువులకు రూ.30వేల వరకు బీమా సదుపాయాన్ని ప్రభుత్వం అమలు చేయనుంది. పాడి రైతులు రూ.30 వేల కంటే అదనంగా బీమా చేసుకోవాలని భావిస్తే అదనపు ప్రీమియం చెల్లించాలి. ఒక్కో పశువుకు గరిష్ఠంగా రూ.1.10లక్షల వరకు బీమా చేసుకోవచ్చు.

నిబంధనలివే..: బీమా కావాలనుకునే రైతులు బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్‌కార్డు, ఎస్సీ, ఎస్టీలు తెల్లరేషన్ కార్డు జత చేయాలి.



రాప్తాడులో బీమా చేసిన ఆవుకు వేసిన ట్యాగ్

పశువులు మృతి చెందిన వెంటనే సమీపంలోని రైతు సేవా కేంద్రం సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. బీమా సర్వే సిబ్బంది వచ్చే వరకు పశువుల చెవికి వేసిన ట్యాగ్‌ను తొలగించకూడదు. బీమా చేసిన పశువులు చనిపోయిన ఏడు రోజుల్లోగా కంపెనీ వారికి తెలియజేసి కొనుగోలుదారుడి పేరుపై మార్చాలి.

అవగాహన కల్పిస్తున్నాం

- ప్రకాశ్, పశుసంవర్ధక శాఖ ఏడీ, రాప్తాడు

పశు బీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వం అందించే రాయితీలను, వాటి ఉపయోగాలను తెలియజేసి, సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నాం.

డ్రాగన్ ఫ్రూట్‌తో లాభాలు

నార్పల, న్యూస్‌టుడే: నార్పలకు చెందిన రైతు రామకృష్ణ డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తూ రూ.లక్షల్లో ఆదాయం గడిస్తున్నారు. గతంలో ఆయన వేరుసెనగ, కంది, ఆముదం, జొన్న పంటలు సాగు చేసి తీవ్రంగా నష్టపోయారు. ఉద్యానశాఖ అధికారుల సూచనలతో మూడేళ్ల కిందట కేశేపల్లి దారిలో ఉన్న రెండెకరాల్లో డ్రాగన్ ఫ్రూట్స్ పంట సాగు చేశారు. ఎకరా విస్తీర్ణంలో 5 వేల మొక్కలకుపైగా నాటారు. రెండు ఎకరాల్లో పంట సాగుకు రూ.10 లక్షలు పెట్టుబడి పెట్టారు. మొక్కలు నాటిన ఏడాది తర్వాత దిగుబడి ప్రారంభమైంది. పండ్లను మార్కెట్‌కు తరలించకుండా పొలం వద్దే కూలీలను ఏర్పాటు చేసుకొని విక్రయిస్తున్నారు. కిలో రూ.150 చొప్పున రోజూ 50 కిలోలకుపైగా అమ్ముతున్నారు. ఆ లెక్కన నిత్యం రూ.7,500 ఆదాయం వస్తోంది. ఏటా ఖర్చులు పోనూ నికరంగా రూ.10 లక్షలకుపైగా ఆదాయం వస్తుందని రైతు చెబుతున్నారు. ఇప్పటి వరకు రూ.20 లక్షల వరకు చేతికందినట్లు తెలిపారు. డ్రాగన్ ఫ్రూట్ పంటకు చీడపీడలు, తెగుళ్ల బెడద ఉండదు. పెట్టుబడి ఖర్చులు తక్కువే. ఒకసారి సాగు చేస్తే 30ఏళ్ల పాటు దిగుబడి చేతికొస్తుందని రైతు చెప్పారు.



సాగైన పంట, అంతర చిత్రంలో పండ్లు

టమాటాలో తెగుళ్లు నివారిస్తే అధిక దిగుబడి

చిట్కా

టమాటా పంటలో తెగుళ్లను నివారిస్తే అధిక దిగుబడి పొందవచ్చని రెడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త మల్లీశ్వరి తెలిపారు. జిల్లాలో 80 వేల ఎకరాల్లో టమాటా పంట సాగవుతోందన్నారు. సూది ముక్కు పురుగు కారణంగా కాయలపై నల్లటి మచ్చలు ఏర్పడి నాణ్యత దెబ్బతింటుందన్నారు. ఈ పురుగుల నివారణకు ఎకరాకు 10 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. వాటితోపాటు కొరాజిన్ 1.5 మి.లీ, ఎమామెక్టిన్ బెంజోయేట్ 5గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. - బుక్కరాయసముద్రం

'ఏఎన్‌ఎంలపై వివక్ష తగదు'

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: గ్రామ వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న ఏఎన్ఎంలను రెండు శాఖల పరిధిలో ఉంచడం అన్యాయమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి విమర్శించారు. సోమవారం రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా కలెక్టరేట్ ఎదుట ఏఎన్ఎంలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సచివాలయ ఉద్యోగులకు మంచి చేస్తామని హామీ ఇచ్చింది. ఈ ప్రకారమే కొన్ని కేడర్లను ఇప్పటికే నిర్దేశిత శాఖల్లో విలీనం చేశారు. ఆరోగ్య శాఖ పరిధిలో ఏఎన్ఎంలను పూర్తిగా విలీనం చేయకుండా రెండు శాఖల్లో ఉంచడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. స్టాఫ్‌నర్సు ఉద్యోగాల పదోన్నతికి ఏఎన్ఎంలకే ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నిరసనలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, ఏఎన్ఎం ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రజనీ, నాయకులు విజయ భారతి, తైరాబాను, పద్మావతి, జయలక్ష్మి, మంజుల, సావిత్రి, తదితరులు మాట్లాడారు. అనంతరం జేసీకి వినతి అందజేశారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఏఎన్ఎం, ఏఐటీయూసీ నాయకులు

ఐదేళ్లుగా భవన నిర్మాణ రంగం కుదేలు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ అస్తవ్యస్త పాలనతో భవన నిర్మాణ రంగం కుదేలై.. సంక్షేమ బోర్డు నిర్వీర్యంగా మారడంతో కార్మికులు అష్టకష్టాల పాలయ్యారని భవన నిర్మాణ కార్మిక సంఘం(సీఐటీయూ) రాష్ట్రాధ్యక్షుడు ఎన్.రమణరావు ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక శ్రీలక్ష్మీ వేంకటేశ్వర కల్యాణ మండపంలో పెనుకొండ నియోజకవర్గంలోని భవన నిర్మాణ కార్మికుల సమావేశాన్ని సంఘం నియోజకవర్గ కన్వీనర్ వెంకటేశ్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివతో కలసి ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు జిల్లాలో లక్ష మందికిపైగా ఉండగా రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మంది ఉన్నట్లు చెప్పారు. జగన్ ప్రభుత్వం గత ఐదేళ్లలో ఇసుకను సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా చేయడంతో నిర్మాణ రంగం ఎక్కడికక్కడ స్తంభించిపోయి, లక్షలాది కార్మికులు ఉపాధి కరవై పొట్ట చేతపట్టుకొని బెంగళూరు, చెన్నై వంటి నగరాలు, ఇతర పట్టణాలకు వలసలు వెళ్లి అనేక అవస్థలు పడ్డారని వారు విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు దాటినా ఇచ్చిన హామీలు సరిగా అమలు చేయక పోవడంతో ఎదురుచూపులు తప్పడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి లేబర్ కార్డులు అందించి, సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని రాష్ట్ర అధ్యక్షుడు డిమాండ్ చేశారు. ఈ హామీల అమలు కోసం ఈనెల 4వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు హనుమయ్య, రామకృష్ణ, రంగప్ప, ఆంజనేయులు, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఆబ్కారీ పోలీసుల బదిలీ

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: మద్య నిషేధ, ఆబ్కారీ(ప్రొహిబిషన్, ఎక్సైజ్) శాఖలో పని చేస్తున్న హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను బదిలీలు చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం జిల్లాలో 58మంది, శ్రీసత్యసాయి జిల్లాలో 36 మంది హెడ్‌కానిస్టేబుళ్లు.. అనంతలో 112 మంది, సత్యసాయిలో 69 మంది కానిస్టేబుళ్లు బదిలీ అయ్యారు. వీరిని ఎక్సైజ్ స్టేషన్లకు, డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలకు నియమించారు.

భక్తాంజనేయస్వామి విగ్రహం చోరీ

పామిడి, న్యూస్‌టుడే : పామిడిలోని పెన్నానది ఒడ్డున ఉన్న శ్రీసీతా రామాంజనేయస్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న శ్రీభక్తాంజనేయ స్వామి విగ్రహం చోరీకి గురైంది. ఆలయధర్మకర్త షణ్ముఖకుమార్ ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ 1938లో నిర్మించిన పురాతన దేవాలయానికి చెందిన మూలవిరాట్ శ్రీభక్తాంజనేయస్వామి రాతి విగ్రహం ఉన్న గుడి తలుపులను పగులగొట్టి ఆదివారం రాత్రి విగ్రహాన్ని ఎత్తుకెళ్లారన్నారు. ఈఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: అప్పులు తీర్చలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. మండలంలోని మేడాపురం గ్రామానికి చెందిన భోగరాతి నాగేంద్ర (38) మూడెకరాల్లో పంటల సాగుకు పలువురి వద్ద అప్పులు చేశారు. భూగర్భ జలాలు అడుగంటడంతో నాలుగు బోర్లు వేయించారు. బోర్ల తవ్వకం, పంటల సాగు కోసం చేసిన అప్పులు దాదాపు రూ.7లక్షలకు చేరాయి. వాటిని ఎలా తీర్చాలని మదనపడేవారు. ఆదివారం సాయంత్రం పొలంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. కుటుంబ సభ్యులు, స్థానికులు అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఆయనకు భార్య మౌనిక, ఇద్దరు కుమారులు ఉన్నారు.



నాగేంద్ర

పిడుగుపాటుకు మహిళ దుర్మరణం

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయ పనులకు వెళ్లిన కూలీ పిడుగుపాటుకు గురై మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని చదం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన మేరకు వివరాలిలా.. కొందరు కూలీలతో కలసి రైతు రామకృష్ణారెడ్డి వ్యవసాయ పొలంలో కూలీ పనులకు వెళ్లారు. వర్షం కురవడంతో సమీపంలోని చెట్టు కిందకు చేరారు. ఒక్కసారిగా పిడుగుపడటంతో హెచ్.గంగమ్మ (58) అక్కడికక్కడే మృతిచెందగా, మరో కూలీ చిట్టెమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. తహసీల్దార్ నాగరాజు బాధితురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండలంలోని 74 ఉడేగోళం గ్రామానికి చెందిన రైతు పాలయ్యకు చెందిన కాడెద్దు పిడుగుపాటుకు గురై మృతిచెందింది.



గంగమ్మ

రైలు కిందపడి కూలీ బలవన్మరణం

తాడిపత్రి: తాడిపత్రి మండలంలోని చల్లవారిపల్లి గ్రామ సమీపంలో రైలుకింద పడి కూలీ ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం తెల్లవారుజామును జరిగింది. రైల్వే ఎస్సై నాగప్ప తెలిపిన వివరాల మేరకు నందలపాడుకు చెందిన గురుస్వామి(40) కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. కొంతకాలంగా మద్యానికి బానిసవ్వడంతో అనారోగ్య పాలయ్యాడు. గురుస్వామి తీవ్ర మనస్థాపానికి గురై రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడికి భార్య నాగలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.



గురుస్వామి

రాయదుర్గం
•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

ఆకట్టుకున్న కళాకృతులు


కళాకృతులను పరిశీలిస్తున్న అధికారులు

కుందుర్పి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులు వ్యర్థ వస్తువులతో చేసిన వివిధ రకాల కళాకృతులను సోమవారం ఎంపీడీవో లక్ష్మీనరసింహ, ఎంఈవో తిప్పేస్వామి పరిశీలించారు. ఆకట్టుకునేలా కళాకృతులను తయారు చేసిన విద్యార్థినులను అభినందించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల ఏర్పడే అనర్థాలను తెలియజేశారు. నిత్యం వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. ఎస్‌వో నిర్మల, ఎంఆర్‌సీ నాగేంద్ర పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసలు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం పట్టణ పోలీస్ స్టేషన్‌లో క్రైం బ్రాంచ్ ఏఎస్ఐ, ముగ్గురు కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ జగదీశ్ ప్రశంసించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో క్రైం బ్రాంచ్ ఏఎస్ఐ గంగాధర, కానిస్టేబుళ్లు బాజామొహిద్దీన్, పుష్పరాజ్, రాజేశ్‌లు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. నియోజకవర్గంలో 16 ద్విచక్రవాహనాలు చోరీ కాగా చాకచక్యంగా వ్యవహరించి చోరులను అరెస్టు చేయడంతో ఎస్పీ అభినందించారు.



ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకుంటున్న ఏఎస్ఐ గంగాధర

ఆబ్కారీ సీఐగా రవిచంద్ర

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ ఆబ్కారీ సీఐగా రవిచంద్ర సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురంలోని ఎక్సైజ్ ఉప కమిషనర్ కార్యాలయం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం రాకుండా, నాటుసారా విక్రయించకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ కిశోర్ కర్నూలు జిల్లా సుంకేశుల తనిఖీ కేంద్రానికి బదిలీ అయ్యారు.

పండ్ల మొక్కల పంపిణీ

శెట్టూరు, న్యూస్‌టుడే: ఆర్డీటీ ఏఎఫ్ ఏకాలజీ ఆధ్వర్యంలో సోమవారం రైతులకు రాయితీతో పండ్ల మొక్కలను ఎస్టీవో తిప్పేస్వామి పంపిణీ చేశారు. మామిడి, అల్లనేరేడు, ఎర్రచందనం తదితర మొక్కలను 75 శాతం రాయితీతో అందజేశామన్నారు. మండలంలో 19 మంది రైతులకు 3329 మొక్కలు పంపిణీ చేసినట్లు వివరించారు.

లాభసాటి వ్యవసాయమే ధ్యేయం


కళ్యాణదుర్గం: జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఏడీఏ యల్లప్ప, రైతులు

✦ రైతులకు 'పొలం పిలుస్తోంది'తో సూచనలు

కళ్యాణదుర్గం గ్రామీణం, రాయదుర్గం పట్టణం, ఉరవకొండ, న్యూస్‌టుడే: అన్నదాతల చెంతకు సాంకేతికను తీసుకెళ్లి వారిలో ఉత్సాహాన్ని పెంపొందించి వ్యవసాయాన్ని లాభసాటి చేసేందుకు కూటమి ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మంగళ, బుధవారాల్లో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు రైతుల చెంతకు వెళ్లి పంటలను పరిశీలించేలా చర్యలు తీసుకొంది. దీనిని పక్కాగా అమలు చేసేందుకు డివిజన్, మండల స్థాయి అధికారులతో ప్రణాళికలు రూపొందించారు.

నియోజకవర్గాల వారీగా సాగు విస్తీర్ణం వివరాలు

నియోజకవర్గం	రైతుసేవా కేంద్రాలు	విస్తీర్ణం	రైతులు
కళ్యాణదుర్గం	91	1.07 లక్షల హెక్టార్లు	67,468
రాయదుర్గం	82	64.49 వేల హెక్టార్లు	51,850
ఉరవకొండ	75	47.41 వేల హెక్టార్లు	58,000

✦ సెప్టెంబరు 24, 25వ తేదీల్లో తొలుత అధికారులు పొలాల బాట పట్టారు. వ్యవసాయ, ఉద్యానవన, పట్టుపరిశ్రమ, పశుసంవర్ధక, ఆత్మ, ప్రకృతి సేద్యం, మార్కెటింగ్, డెయిరీ తదితర అనుబంధ విభాగాల అధికారులు, సిబ్బంది, శాస్త్రవేత్తలు పొలాలను సందర్శించారు.

✦ రైతుల పంటల సాగు, ప్రస్తుతం ఏ దశలో ఉంది, తగిన సలహాలు, సూచనలిస్తూ ఆదాయాన్ని పెంచేలా కృషి చేస్తోంది. ఏ ఏ గ్రామాల్లో కార్యక్రమం ఏర్పాటు చేయాలనే దానిపై రైతులకు ఆయా శాఖల అధికారులు సమావేశం నిర్వహించి, ఎంపిక చేసి ముందుస్తుగానే సమాచారం ఇస్తున్నారు.

నివారణ చర్యలు వివరిస్తాం

- ఏడీఏలు యల్లప్ప, లక్ష్మానాయక్

సాగు చేస్తున్న పొలాలు, ఉద్యానవన పంటలను పరిశీలించి, అందులోని చీడపీడలను గుర్తించి నివారణ చర్యలను రైతులకు తెలియజేస్తాం. వ్యవసాయ సాంకేతిక పద్ధతులను వివరించడం, వాటిని రైతులు పాటించేలా చేసి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడం, మార్కెటింగ్ మెలుకువలు తీసుకోవడం వల్ల వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేయాలనే లక్ష్యంతో కార్యక్రమాలు చేపడుతున్నాం.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

రాయదుర్గం పట్టణం: 9666888046, కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661, ఉరవకొండ: 8008573071

సమస్య: మండలంలోని చెన్నంపల్లిలో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. - ప్రవీణ్, స్థానికుడు
సమాధానం: వెంటనే సమస్యను పరిష్కరిస్తాం. - వీరశేఖర్, పంచాయతీ కార్యదర్శి

సమస్య: మండలంలోని కోటంగుడలో మోటార్లు మరమ్మతులకు చేయకపోవడంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం. - లింగప్ప, గ్రామస్థుడు
సమాధానం: తక్షణం తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం. - రాఘవేంద్ర, పంచాయతీ కార్యదర్శి

సమస్య: ఎస్సీ కాలనీలో చిన్నపాటి వర్షం వచ్చినా వీధులన్నీ అపరిశుభ్రంగా ఉంటున్నాయి. - లింగప్ప, స్థానికుడు
సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - ఇన్‌ఛార్జి ఎంపీడీవో, రఘురామ్‌రావు

సమస్య: మండలంలోని బసంపల్లి వీధి దీపాలు రాత్రికి మాత్రమే వెలిగేలా ఉంచాలి. - చిననల్లి, బసంపల్లి
సమాధానం: పగలు వెలగకుండా చూస్తాం. - వెంకటపతి, లైన్‌ఇన్‌స్పెక్టర్

- న్యూస్‌టుడే, కంబదూరు, శెట్టూరు

రైల్వే వంతెన పనులకు వినతి


ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గం, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో రాయదుర్గంలో ఆగిన రెండు రైల్వే వంతెనలను పూర్తి చేసేందుకు రూ.79 కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు. సోమవారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. రాయదుర్గం - అనంతపురం రోడ్డులో నిర్మాణంలో ఉన్న వంతెనకు రూ.44 కోట్లు, రాయదుర్గం - కణేకల్లు రోడ్డులోని రైల్వే వంతెనకు రూ.35 కోట్లు అవసరమని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున రైల్వే వంతెన పనులు పూర్తి చేస్తారన్న విశ్వాసం పట్టణ ప్రజల్లో ఉందన్నారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలోనైనా నిధులు మంజూరు చేసి పనులను తిరిగి ప్రారంభించాలని కోరారు.

రక్తం ఇస్తూ.. ఊపిరి పోస్తూ..



● రక్తం అవసమని తనకు తెలిసిన వెంటనే ఎక్కడికైనా వెళ్లి ఇవ్వనున్నట్లు గొంచిరెడ్డిపల్లికి చెందిన దివాకర్‌రెడ్డి తెలిపారు. ఇతని రక్త గ్రూప్ (ఓ-నెగిటీవ్). బెంగళూరులో స్టాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పని చేస్తున్నారు. గత 18 ఏళ్ల నుంచి ఇప్పటి వరకు 37 సార్లు రక్తదానం చేయగా, ఇందులో 16 సార్లు సింగల్ డోనర్ ప్లేట్లెట్స్ (ఎస్‌డీపీ)లను కూడా దానం చేశాను.

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రమాద సమయాల్లో రక్తదానం చేస్తూ ప్రాణాలు నిలుపుతున్నారు రక్తదాతలు. కళ్యాణదుర్గంలో 2019 ఫిబ్రవరిలో దుర్గం రక్తదాల సంస్థను స్థాపించారు. వ్యవసాయపక అధ్యక్షులుగా ప్రభుత్వ ఉపాధ్యాయులు కంబాల తిమ్మారెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. సుమారు 3 వేల మంది ఉండగా, 400 మంది రక్తదానం చేస్తుంటారు. ఇప్పటి వరకు 50 వరకు రక్తదాన శిబిరాలు నిర్వహించి ప్రభుత్వాస్పత్రి, రెడ్‌క్రాస్, ఆర్డీటీ సంస్థలకు రక్తాన్ని అందజేశారు. 83097 54313, 94926 49130 చరవాణి నెంబర్లకు సమాచారం తెలిపినా వెంటనే స్పందించి బాధితులకు భరోసా ఇస్తున్నారు.



దుర్గం రక్తదాత బృందం సభ్యులు



● గుమ్మఘట్ట మండలం కోనాపురం గ్రామానికి చెందిన ఎం.జీ వీరన్న జీవిత బీమా సంస్థ ఏజెంటుగా పని చేస్తున్నారు. ఇప్పటి వరకు 68 సార్లు రక్తదానం చేశారు. అర్ధరాత్రి తనకు ఫోన్ చేసినా రక్తదానం చేస్తారు. ఎక్కువ శాతం గ్రామీణ ప్రాంత వాసులు, పేదలు ఎక్కువగా ఉంటున్నారు. వారికి ఆపదలో అదుకునే అవకాశం తను దొరకడం అదృష్టంగా భావిస్తానని వీరన్న తెలిపారు. **-రాయదుర్గం పట్టణం**


కబడ్డీ పోటీలో విద్యార్థినులు

క్రీడల్లోనూ రాణించాలి

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ శిల్ప, కాలవ భరత్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో తాలూకా స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంఈవో నాగమణి, ప్రధానోపాధ్యాయుడు సోమశేఖర్, క్రీడల తాలూకా సమన్వయకర్త నాగేంద్ర, మండల సమన్వయకర్తలు రామాంజనేయులు, శివశరణప్ప, నాగేంద్ర, భోగేశ్, పీడీలు రామాంజనేయులు, రాజశేఖర్, మల్లికార్జున, సుధాకర్, ఇస్మాయిల్, జయప్ప, కరెప్ప పాల్గొన్నారు. ● అండర్ 14 బాలుర విభాగం వాలీబాల్‌లో డి.హీరేహాళ్, గుమ్మఘట్ట, కణేకల్లు జట్లు, అండర్ 17 విభాగంలో కణేకల్లు జట్లు జిల్లా స్థాయికి ఎంపికయ్యాయి. అండర్ 17 బాలికల విభాగంలో గుమ్మఘట్టకు చెందిన టీమ్ గెలుపొందింది. కబడ్డీలో అండర్ 14 బాలుర విభాగంలో కణేకల్లు, బాలికల విభాగంలో డి.హీరేహాళ్ జట్లు గెలిచాయి. చెస్‌లో అండర్ 14 బాలికల్లో నేహ (కేజీబీవీ డి.హీరేహాళ్), బాలురలో మనోజ్‌కుమార్ (ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ కణేకల్లు), అండర్ 17 విభాగంలో బాలికల్లో బ్రహ్మిత (ఎంజేపీ గుమ్మఘట్ట), బాలురలో చరణ్‌కుమార్ (ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ కణేకల్లు) విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వివరించారు.

కదలని మురుగు..!



శెట్టూరు మండలం లక్ష్మంపల్లిలో ఏ వీధి చూసినా అపరిశుభ్రత నెలకొనడంతో రోగాల బారిన పడి ఇబ్బందులకు గురవుతున్నట్లు గ్రామస్థులు వాపోతున్నారు. దారుల్లో మురుగు పేరుకుపోవడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలని, మురుగు కాలువలు నిర్మించాలని గత ప్రభుత్వంలో అధికారులు, నాయకులకు తెలిపినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఈ విషయమై ఈవోఆర్డీ రఘురామ్ దృష్టికి తీసుకెళ్లగా.. సచివాలయం ద్వారా ప్రతిపాదనలు పంపితే నిధులు మంజూరైనప్పుడు చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, శెట్టూరు**

రోడ్డెక్కిన ముళ్లపొదలు



మండలంలోని చాపిరి సమీపంలో రోడ్డును ముళ్లపొదలు కప్పేశాయి. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రోడ్డు, మలుపుల వద్ద ముళ్ల చెట్లు ఉండడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ముళ్లచెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి బొజ్జన్నను వివరణ కోరగా.. సంబంధిత అధికారులతో చర్చించి తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు.
- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఆదివారం రాత్రి ద్విచక్ర వాహదారుడు ఢీకొనడంతో పాదచారుడు ముత్యాలప్ప (73) తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం అనంతపురం తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో అదే రోజు అర్ధరాత్రి మృతి చెందినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వివరించారు.

భూమి కాజేసిన అల్లుడు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: పట్టాదారు పాసుపుస్తకాలు చేయిస్తానని నమ్మించి రూ.50 వేలు నగదు తీసుకొని, ఏకంగా భూమినే కాజేసి ఘరానా మోసానికి పాల్పడిన అల్లుడి ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది. మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన కావలి నరసమ్మ, ముసలప్ప దంపతులకు కొలగానహళ్లి గ్రామ పొలం సర్వే నంబరు 147లో ఆరు ఎకరాల ప్రభుత్వ భూమిని గత కొన్నేళ్లుగా సాగు చేసుకొంటున్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు తమ పేరుపై చేయించాలని అల్లుడు ఆంజనేయులుకు ఏడేళ్ల కిందట రూ. 50 వేలు నగదు ఇచ్చారు. తన భార్య అచ్చమ్మపై నాలుగు ఎకరాల భూమిని చేయించుకుని బ్యాంకు రుణం తీసుకున్నాడు. ఇప్పటికీ ఆ భూమిలో తామే సాగులో ఉన్నామని, పాసుపుస్తకాలు కావాలని అధికారులను కోరితే వేరే వారిపై అయ్యాయని చెప్పారని బాధితులు వాపోయారు. అల్లుడు ఆంజనేయులు నమ్మించి మోసం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులను వేడుకున్నారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురిపై కేసు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బోరంపల్లిలో అన్నదమ్ముల మధ్య పొలం రస్తా విషయంలో పట్టింపులు ఉండేవి. ఆదివారం రాత్రి కాడన్న, ఆంజనేయులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకొన్నారు. ఇరువురి ఫిర్యాదులు చేసుకోగా పరిశీలించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు గ్రామీణ పోలీసులు తెలిపారు.

కుందుర్పి: మండలంలోని అపిలేపల్లికి చెందిన అన్నదమ్ములు తిమ్మప్ప, హనుమంతరాయుడు భూవివాదమై సోమవారం దాడులు చేసుకున్నారు. వారసత్వంగా వచ్చిన భూముల వాటాల్లో ఏర్పడిన విభేదాలతో తరుచూ గొడవ పడేవారు. పొలంలో దాడులు చేసుకుని గాయపడ్డారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. ప్రస్తుతం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరిద్దాం



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వినూత్న

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిద్దామని అదనపు (అసిస్టెంట్) కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న అధికారులకు సూచించారు. గతంలో ఆర్డీవోగా పని చేసిన రాణిసుస్మిత పదోన్నతిపై బదిలీ కావడంతో ఆ స్థానంలో వినూత్న బాధ్యతలు తీసుకున్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో తహసీల్దార్లు, డీటీలతో సమావేశమయ్యారు. రెవెన్యూ డివిజన్‌కు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

రైతుల సంక్షేమానికి కృషి

ఉరవకొండ, న్యూస్‌టుడే: రైతుల అభివృద్ధికి పాటుపడుతామని మండలం వెలిగొండ మైక్రో వాటర్‌షెడ్ కమిటీ ఛైర్మన్ శ్రీరాములు, వైస్ ఛైర్మన్ రామకృష్ణ పేర్కొన్నారు. సోమవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. వాటర్‌షెడ్ సాంకేతిక అధికారులు విశ్వనాథరెడ్డి, సతీశ్‌ల పర్యవేక్షణలో కమిటీలో మొత్తం 11 మంది సభ్యులను ఎన్నుకున్నారు. గ్రామంలో పనులు గుర్తించి తీర్మానాలు చేసి, మంజూరుకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. తమ ఎన్నికకు మంత్రి పయ్యావుల కేశవ్, ఆయన సోదరుడు పయ్యావుల శ్రీనివాసులు చొరవ చూపారన్నారు. వారి సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. అనంతరం స్థానిక రైతులు కొత్త ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను సత్కరించారు. నాయకులు గురు, మల్లి, లక్ష్మన్న, గోపాల్ పాల్గొన్నారు.

తెదేపా బలోపేతమే లక్ష్యంగా సభ్యత్వ నమోదు


ఉరవకొండ: ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఉరవకొండ, కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: తెదేపా బలోపేతమే లక్ష్యంగా సభ్యత్వ నమోదులో పోలింగ్ బూత్ కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలు భాగస్వాములు కావాలని ఆయా మండలాల తెదేపా కన్వీనర్లు విజయభాస్కర్, మారయ్య, వెంకటేశ్, ప్రసాద్, మురళీ, ప్రధాన కార్యదర్శి గోవింద్, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్లు నాగరాజు, మారెన్న, మాజీ ఎంపీపీ సుంకురత్నమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో సోమవారం నియోజకవర్గంలోని తెదేపా శ్రేణులకు సభ్యత్వ నమోదుపై శిక్షణ ఇచ్చారు. ఎక్కువ మందిని సభ్యులుగా చేర్చేలా క్షేత్రస్థాయిలో ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అంతకు ముందు మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కళ్యాణదుర్గంలో తెదేపా సీనియర్ నాయకులు మల్లికార్జున, రామాంజనేయులు, ఆర్.జి. శివశంకర ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పించారు.

కౌన్సిలింగ్ విధానంలో బదిలీలు చేపట్టాలి

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వంలో ఉపాధ్యాయుల బదిలీలు వందల సంఖ్యలో సిఫార్సులు, అక్రమ పద్ధతిలో జరిగాయని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పాతిరెడ్డి అన్నారు. సోమవారం మల్లికార్జునపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల ముందు 650 మందిని సిఫార్సుల బదిలీలు సిద్ధం చేయగా ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం సిఫార్సు ప్రక్రియను నిలిపివేసి, కౌన్సిలింగ్ విధానంతో బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున, ఉపాధ్యాయులు గోవర్దన్, వెంకటేశులు, నారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ సుమతి

సమస్యల పరిష్కారమే ధ్యేయం

బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే: మండలంలోని దళితుల సమస్యల పరిష్కారమే లక్ష్యమని తహసీల్దార్ సుమతి పేర్కొన్నారు. సోమవారం గొంచిరెడ్డిపల్లిలోని దళిత కాలనీలో సివిల్ రైట్స్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లోని పేదలు, బలహీనవర్గాలు, దళితులు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్ వార్డన్ శ్రీనివాస్, మండల తెదేపా అధ్యక్షుడు శ్రీరాములు, సర్పంచి గోవిందప్ప, మాజీ ఎంపీపీ మంజుళ, జమేదార్ ఎర్రిస్వామి, ఆర్ఐ నాగిరెడ్డి, గ్రామకార్యదర్శి కవిత పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదుకు స్పందన

రాయదుర్గం, న్యూస్‌టుడే: లక్ష్మీబజారు ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద సోమవారం నిర్వహించిన భాజపా సభ్యత్వ నమోదుకు స్పందన లభించింది. ఒకే రోజే 318 మంది సభ్యత్వాన్ని తీసుకున్నారు. భాజపా జిల్లా కార్యదర్శి నాని, కిషాన్‌మోర్చా సోషియల్ మీడియా కన్వీనర్ వేణుగోపాల్‌రాయ్, పట్టణ ఉపాధ్యక్షుడు ఆత్మానంద, పట్టణ ఓబీసీ మోర్చా జనరల్ సెక్రటరీ రవీంద్ర, యువమోర్చా పట్టణాధ్యక్షుడు త్రినాథ్, భీమసేన, తిప్పేస్వామి, మహిళా మోర్చా పట్టణాధ్యక్షురాలు మీనాక్షి, జనరల్ సెక్రటరీ హరిత పాల్గొన్నారు.

విద్యుత్తు స్తంభం మార్చాలని వినతి

ఉరవకొండ: పట్టణంలోని కొండప్పబావి వెనుక వీధిలో ఇనుప విద్యుత్తు స్తంభం కింది భాగంలో తుప్పు పట్టి, శిథిలమైంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. వెంటనే మార్చాలని కోరుతూ కాలనీవాసులు సోమవారం తహసీల్దార్ మహబూబ్ బాషాకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని పాత ప్రయాణ ప్రాంగణంలో వర్షపు నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోందని ఎంపీటీసీ వన్నూర్‌సాబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. రేషన్‌కార్డుదారులకు దసరా కానుకను పంపిణీ చేయాలని కోరారు.

అపరిశుభ్రతపై తాఖీదులు

కుందుర్పి: మండలంలోని తెనగల్లులో అపరిశుభ్రతకు కారణమైన వారికి సోమవారం గ్రామకార్యదర్శి రఘు, సచివాలయ సిబ్బంది తాఖీదులు ఇచ్చారు. సెప్టెంబరు 23న 'ఈనాడు'లో పడకేసిన పారిశుద్ధ్యం.. అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో లక్ష్మీనరసింహ కాలనీల్లో పర్యటించారు. బాధ్యులపై చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. మురుగు వీధుల్లోకి వదలకూడదని సూచించారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: మున్సిపాలిటీలో పని చేస్తున్న పలువురు పారిశుద్ధ్య కార్మికులను తొలగించారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఐకాస, దళిత, గిరిజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. సోమవారం అంబేడ్కర్ కూడలి నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి కార్యాలయ ముట్టడికి ప్రయత్నించారు. కమిషనర్ లేకపోవడంతో అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు. అనంతపురం రోడ్డుపై బైఠాయించారు. సమస్యలను తక్షణం పరిష్కరించాలని, కమిషనర్ నిర్లక్ష్య వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు.

మా మంచి మాష్టారు


విద్యార్థులకు బోధిస్తున్న అబ్దుల్ వారీస్

- విద్యాభివృద్ధికి విశేష కృషి
- రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గంలోని రాజీవ్‌గాంధీ ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.అబ్దుల్ వారీస్ ఉర్దూ విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. విధుల్లో అంకితభావం, విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా పాఠాలు బోధిస్తున్నారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న ఉర్దూ పాఠశాలల్లో వాలంటీర్లను నియమించారు. అందుకు తన సొంత నిధులతో పాటు మిత్రులు, ప్రజల సహకారం తీసుకున్నారు. ఉర్దూ సబ్జెక్టులో మాడ్యూల్స్ తయారీతో పాటు మౌలిక వసతులు కల్పిస్తున్నారు. పాఠశాలల్లో బాలికల హాజరు తక్కువగా ఉండటంతో విద్య ఆవశ్యకతను తెలియజేస్తూ హాజరు శాతం పెరిగేందుకు కృషి చేశారు.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు

ఏటా పదో తరగతి విద్యార్థులను జట్లుగా విభజించి సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ పుస్తకాలతో ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. 2013 నుంచి వరుసగా 90 శాతానికిపైగా ఉత్తీర్ణత శాతంతో మంచి ఫలితాలు సాధిస్తున్నారు. విద్యార్థులు ఉన్నత విద్య, ఉద్యోగాల్లో రాణించేలా ఉర్దూతోపాటు ఆంగ్ల మాధ్యమాన్ని నిర్వహిస్తున్నారు. ఇంటర్ పూర్తయిన విద్యార్థులకు కర్ణాటకలోని షికారిపుర, కెరెబిల్లి పట్టణాల్లో ఉపాధ్యాయ శిక్షణ కోర్సుల్లో ఉచిత, ఫీజుల మినహాయింపుతో శిక్షణకు కృషి చేస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన 50 మంది విద్యార్థులు టెట్‌లో ఉత్తీర్ణత సాధించగా పలువురు ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. ఉత్తమ సేవలకుగాను రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారాలు అందుకోవడం విశేషం. విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం. ప్రతిఒక్కరూ పిల్లలను విద్యావంతులు చేయాలని అబ్దుల్ వారీస్ కోరుతున్నారు.

పట్టుజారితే.. ప్రమాదమే

మరమ్మతులకు నోచుకోని రహదారులు


గుంతలు పడి అధ్వానంగా సొల్లాపురం - హనకనహాళ్ రోడ్డు

కణేకల్లు: మండలంలోని సొల్లాపురం - హనకనహాళ్‌కు వెళ్లే 8 కి.మీ. ర.భ రహదారి గుంతలను తలపిస్తూ అధ్వానంగా మారింది. గత వైకాపా ప్రభుత్వంలో లక్షలాది రూపాయలతో మరమ్మతులు చేపట్టినా, నాసిరకం పనులతో నాణ్యత డొల్లగా తయారై రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. వర్షపు నీటి ఉద్ధృతికి పలుచోట్ల వంతెనలు కోతకు గురై దెబ్బతినడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిళ్లు గుంతలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నట్లు ఆందోళన చెందుతున్నారు. ర.భ అధికారులు స్పందించి రహదారితో పాటు వంతెనల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు. ఈ విషయమై ర.భ. అధికారులను వివరణ కోరగా.. రహదారి మరమ్మతుకు ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు.

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి



విజేతలకు ప్రశంసాపత్రం అందజేస్తున్న డైరెక్టర్ బాలాజీమురారి

విజేతలకు బహుమతుల ప్రదానం

గార్లదిన్నె: గార్లదిన్నె సమీపంలో కేంద్ర ప్రభుత్వం నెలకొల్పిన ట్రాక్టర్ నగర్‌లో 15రోజులుగా నిర్వహించిన హిందీభాషా పక్వాడా కార్యక్రమం సోమవారం ముగిసింది. సంస్థ డైరెక్టర్ బాలాజీమురారి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిబ్బందితో పాటు శిక్షణ విద్యార్థులు పాల్గొన్నారు. హిందీభాషపై వివిధ విభాగాల్లో నిర్వహించిన వ్యాసరచన, పాటల పోటీ తదితర కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలు డైరెక్టర్ చేతుల మీదుగా అందజేశారు.

సాయినాథ్‌గౌడ్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న తెదేపా నాయకులు

గుంతకల్లు: గుంతకల్లు నియోజకవర్గం అభివృద్ధికి దివంగత మాజీ ఎమ్మెల్యే ఆర్.సాయినాథ్‌గౌడ్ చాలా కృషిచేశారని వక్తలు అన్నారు. ఆయన వర్ధంతి కార్యక్రమం సోమవారం తిలక్‌నగర్‌లో జరిగింది. మాజీ ఎమ్మెల్యే, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జితేంద్రగౌడ్, బీసీ విభాగం రాష్ట్ర అధికారప్రతినిధి పవన్‌గౌడ్ మాట్లాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి తెదేపా నాయకులు పూలమాలవేసి నివాళి అర్పించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో తెదేపా నాయకులు కేశప్ప, అనిల్‌గౌడ్, నాగరాజు, మహమ్మద్ షరీఫ్, రాఘవేంద్ర, శివన్న పాల్గొన్నారు.

దేవాలయాల్లో జనసైనికుల పూజలు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రంలో వెలసిన వేంకటరమణస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల లడ్డు విషయంలో కల్తీ జరిగిందని తెలియడంతో ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దీక్ష చేపట్టారన్నారు. ఆయనకు మద్దతుగా నియోజకవర్గ జనసేన పార్టీ ముఖ్య నాయకులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. జనసేన నాయకులు మురళీకృష్ణ, ఈశ్వరయ్య, చంద్ర, కృష్ణమూర్తి, మునీంద్ర, ఎర్రిస్వామి, పాల్గొన్నారు.

ఆసుపత్రి పనుల్లో..



బయలుకే నూతన ఆసుపత్రి భవనం

➤ ప్రారంభానికి ముందే డొల్లతనం బహిర్గతం

➤ రూ.1.86 కోట్లతో భవన నిర్మాణం

నాణ్యతకు తిలోదకాలు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: రోగులకు శాశ్వతంగా వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం రూ.కోట్లతో నిర్మించిన 30 పడకల నూతన ప్రభుత్వ ఆసుపత్రి భవన పనుల్లో నాణ్యత లోపించింది. గుత్తేదారుడు పనుల్లో ఎక్కడా నాణ్యతాప్రమాణాలు పాటించలేదనేది ఇక్కడి పరిస్థితిని చూస్తే అర్థమవుతుంది.

★ పెద్దవడుగూరులో గత వైకాపా ప్రభుత్వ హయాంలో నూతన ప్రభుత్వ ఆసుపత్రి భవనానికి రూ.1.86 కోట్లను మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న గుత్తేదారుడు పనులను ఆలస్యంగా ప్రారంభించి నిధులను 90 శాతం మంజూరు చేయించుకుని ఇక్కడి భవనంలో తలుపులు, కిటికీలు, ఇతరత్రా సామగ్రిని నాసిరకంగా వేసి పనులు పూర్తి చేశారు. ఆసుపత్రి భవనం ముందు భాగం అందంగా కనిపిస్తున్నా లోపల అంతా నాణ్యత ప్రమాణాలు పాటించలేదు. తలుపులే కాకుండా గోడలు, కిందిభాగంలో బండలు ప్రారంభానికి ముందే నెర్రలిచ్చాయి. వైద్యులు ఉండే గదుల్లోనే కిటికీలు, గోడలు నెర్రలిచ్చాయి.



ఆసుపత్రి ముందు భాగంలో కంకర రోడ్డు

కలెక్టర్ పరిశీలించి హెచ్చరించినా..?

గత మాసంలో పరిశీలనకు వచ్చిన కలెక్టర్ వినోద్ కుమార్ ఇక్కడి పనులను చూసి ఆర్‌అండ్‌బీ, వైద్యశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రికి వచ్చే రహదారి పనులు, ప్రహరీ, గేటు, ఆర్చ్ నిర్మించాల్సి ఉంది. వీటిని చేయకుండానే ఆసుపత్రిని ప్రారంభిస్తారా అంటూ కలెక్టర్ పర్యటన అనంతరం ఆసుపత్రిని డీఎంహెచ్‌వో భ్రమరాంబదేవి పరిశీలించారు. ఆ సందర్భంగా గుత్తేదారుడు, అధికారులపై మండిపడ్డారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి భవనంలో నెర్రలిచ్చిన చోట పనులు చేయిస్తాం. ప్రస్తుతం కొత్త భవనం పూర్తిస్థాయిలో సిద్ధం చేశాం. ఇక రోడ్డు, గేట్, ప్రహరీ పనులున్నాయి. త్వరలోనే పూర్తి చేసి ప్రారంభించేందుకు సిద్ధం చేస్తాం.

- నరసింహమూర్తి, ఆర్అండ్‌బీ, ఈఈ, పెద్దవడుగూరు

సమస్య: తాడిపత్రిలోని పుట్లూరు రోడ్డులో మూడు మ్యాన్‌హోళ్లు వరసగా మరమ్మతులకు గురయ్యాయి.- నారాయణస్వామి, వాహనదారుడు

సమాధానం: సమస్యను పరిష్కరిస్తాం. - తేజ మున్సిపల్ ఏఈ

– న్యూస్‌టుడే, తాడిపత్రి

సమస్య: గుంతకల్లులోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఓవర్ హెడ్ ట్యాంకు సమీపంలో రోడ్డు కోతకు గురై గుంత ఏర్పడింది. - రాజు, స్థానికుడు.

సమాధానం: మరమ్మతులు చేయిస్తాం. -హరికృష్ణ, ఏఈ

– న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

కల్వర్టు శిథిలం



అధ్వానంగా ఉన్న కల్వర్టు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిలో కోటకు వెళ్లే రోడ్డులోని కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఇరుక్కుపోతున్నాయి. రాత్రిళ్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం రాకపోకలు సాగించే రోడ్డులో ఇలా ఉన్నా పురపాలిక అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. దీనిపై డీఈఈ హేమచంద్ర మాట్లాడుతూ కల్వర్టుకు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించి వాహనదారులకు ఇబ్బందులు తప్పిస్తామన్నారు.

దేవీ నవరాత్రులు విజయవంతం చేద్దాం

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే: గుత్తి మండలంలోని చెర్లోపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సేవాఘడ్‌లో వెలసిన మాత జగదాంబ దేవి నవరాత్రి ఉత్సవాలు విజయవంతం చేయాలని ఆలయ ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్ పిలుపునిచ్చారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గోడపత్రాలు విడుదల చేశారు. సేవాఘడ్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట



ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, న్యూస్‌టుడే: పేదల ఆరోగ్యానికి పెద్ద పీట వేసి ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందిస్తోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రిని సోమవారం ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఆసుపత్రి ఓపీని పరిశీలించి రోగులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది పనితీరు రోగులను అడిగారు. అనంతరం ఆమె మాట్లాడారు. శుద్ధజల యంత్రం ఏర్పాటు, జనరేటర్‌కు మరమ్మతులు చేయించామన్నారు. వైకాపా ప్రభుత్వం ఆసుపత్రిలో చిన్న పాటి వసతి కూడా ఏర్పాటు చేయలేదన్నారు. గ్రామంలో ఉన్న మురుగు, కంప చెట్లను వెంటనే తొలగించాలని ఎంపీడీవో నిర్మలకుమారిని ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి సౌకర్యాలను మెరుగు పరచాలని తెలిపారు. ఆర్డీటీ పాఠశాలను పరిశీలించి అవసరాలను తెలుసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలించి అవసరాలను తెలుసుకొని అధికారులకు వివరించారు. ఆ తర్వాత కెనరా బ్యాంకు వద్దకు వెళ్లి అక్కడి మేనేజర్ పనితీరుపై ఆగ్రహించారు. రాయితీ రుణాల మంజూరు వేగవంతం చేస్తారని మండిపడ్డారు. తహసీల్దార్ కార్యాలయం తనిఖీ చేసి కార్యాలయంలో ఉన్న ముళ్లపొదలు, అపరిశుభ్రతను తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ రామకృష్ణ, మాజీ జడ్పీటీసీ పాలిని, తెదేపా నాయకులు చిదానందయ్య, గుర్రం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. శింగనమలలో గుండె పోటుతో మృతి చెందిన తెదేపా కార్యకర్త సుధాకరయాదవ్ కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పరామర్శించారు.



చేనేత సంఘం నాయకులు, కార్మికుల ర్యాలీ

చేనేతలను ఆదుకోవాలి

పామిడి, న్యూస్‌టుడే: చేనేత కార్మికులను తెదేపా ప్రభుత్వం ఆదుకోవాలని జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ ప్రధాన కార్యదర్శి నీలూరి రమేష్ ఆధ్వర్యంలో చేనేత కార్మికులు ర్యాలీ చేపట్టారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఏవీ రమణ, పామిడి వలిని రామాంజనేయులు, శ్రీరాములు, రమేష్, సూరి, పేక్తావలి, సురేష్ పాల్గొన్నారు.

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: చేనేతలను ఆర్థికంగా ఆదుకుని న్యాయం చేయాలని కోరుతూ సోమవారం సీపీఐ, చేనేతకార్మిక సంఘాల నాయకులు తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. సీపీఐ సీనియర్ నాయకుడు సూర్యనారాయణరెడ్డి, నారాయణ, మండల కార్యదర్శి వెంకటరాముడుయాదవ్, సహాయ కార్యదర్శి పోలా రంగస్వామి, లక్ష్మణన్, ఆదినారాయణ, నారాయణస్వామి, హనుమేశప్ప, బాస్కర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ వాలంటీర్లకు పురస్కారాలు



పురస్కారాన్ని అందుకున్న స్కౌట్ వాలంటీర్లను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గుంతకల్లు, న్యూస్‌టుడే: రాయలసీమలో గుంతకల్లుకు చెందిన రైల్వే ఉన్నత పాఠశాలలో చదువుతూ స్కౌటింగ్‌లో పాలుపంచుకుంటున్న స్కౌట్స్ వాలంటీర్లు ప్రత్యేక తను చూపించుకున్నారని సీనియర్ డీపీసీ జయశంకర్ చౌహాన్, పాఠశాల ప్రధానాచార్యుడు మధుసూదన్ అన్నారు. సికింద్రాబాద్ జోనల్ స్థాయిలో స్కౌట్స్ వాలంటీర్లకు రాష్ట్రపురస్కార్ కోసం పరీక్ష నిర్వహించారు. వీరిలో గుంతకల్లు డివిజన్ పురస్కారాలు సొంతం చేసుకొని రికార్డు సృష్టించింది. మూడు రోజుల కిందట సికింద్రాబాద్‌లో జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ చేతుల మీదుగా పురస్కారాలను అందుకున్న వాలంటీర్లకు సోమవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం జరిగింది. గతంలో ఐదారుగురు మాత్రమే ఉత్తీర్ణులయ్యేవారని, ప్రస్తుతం 23 మంది పురస్కారాలు అందుకున్నారన్నారు. స్కౌట్స్‌లో విద్యార్థులు రాణించడానికి స్కౌట్ లీడర్ కమిషనర్ హనుమేశ్‌బాబు కృషి చేశారు.

రూ.3 లక్షల నగదు చోరీ

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులో వేణుగోపాల్‌రెడ్డికి చెందిన ద్విచక్ర వాహనంలో నుంచి సోమవారం రూ.3 లక్షల నగదు చోరీ గురైనట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు. హౌసింగ్‌బోర్డులో నివాసం ఉన్న వేణుగోపాల్‌రెడ్డి మధ్యాహ్నం యూనియన్ బ్యాంకులో రూ.3లక్షల నగదు డ్రా చేసుకుని ద్విచక్ర వాహనంలో వెనక బ్యాగులో పెట్టుకుని క్లాన్ టాకీస్ వీధిలోకి వెళ్లారు. అక్కడ వాహనాన్ని నిలిపిఉంచి పక్కనున్న కొంతమందితో వ్యాపారాలు కొనుగోలు చేయడానికి వెళ్లారు. తిరిగొచ్చేసరికి నగదు చోరీకి గురైంది. రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సం క్షి ప్త స మా చా రం

విధుల్లో చేరిన గృహనిర్మాణ శాఖ ఏఈ

యాడికి, న్యూస్‌టుడే: యాడికి మండలం గృహ నిర్మాణ శాఖ ఏఈగా లోకేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసే ఏఈ ప్రశాంత్‌కుమార్ గుమ్మగట్ట మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పుట్లూరు మండలం నుంచి లోకేష్ బదిలీపై వచ్చారు.

ఎస్సైల బాధ్యతల స్వీకరణ

శింగనమల: శింగనమల పోలీస్ స్టేషన్ ఎస్సైగా శరత్ చంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్సై చంద్రశేఖర్ గత నెలలో బదిలీపై వెళ్లారు.

గుత్తి: గుత్తి ఎస్సై సురేష్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. కొత్తగా వచ్చిన ఎస్సై సురేష్‌కు కానిస్టేబుళ్లు స్వాగతం పలికారు.

బుక్కరాయసముద్రం: బుక్కరాయసముద్రం ఎస్సైగా శేషగిరిరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో నేరాల నియంత్రణకు తనవంతుగా కృషి చేస్తానన్నారు.

హోటల్ నిర్వాహకులపై దాడి

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే: మండలంలోని జోడి ధర్మాపురం టోల్ గేట్ సమీపంలో హోటల్ నిర్వాహకులపై చీమలవాగుపల్లికి చెందిన కొందరు సోమవారం రాత్రి దాడి చేశారు. చీమలవాగుపల్లికి చెందిన మధు, అమరేశ్ పాటు పలువురు యువకులు హోటల్ వద్దకు వచ్చి వారికి కావాల్సిన ఆహార పదార్థాలు తీసుకున్నారు. డబ్బు చెల్లించే విషయంలో గొడవ పెట్టుకున్నారు. ఈక్రమంలో హోటల్ నిర్వాహకులు కొండయ్య, నారాయణస్వామి, జయచంద్రలపై దాడి చేయడంతో పాటు హోటల్‌ను ధ్వంసం చేశారు. ఎస్సై గౌస్‌బాషా హోటల్‌ను పరిశీలించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల కార్యవర్గం ఏర్పాటు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: కల్లూరు గ్రామంలో సోమవారం ఫొటో, వీడియోగ్రాఫర్ల సమావేశం జరిగింది. గార్లదిన్నె, కల్లూరు, తరిమెల, పామిడి ప్రాంతాల్లో ఉన్న ఫొటో, వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు. ఏకగ్రీవంగా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా చెన్నా సురేష్, ఉపాధ్యక్షుడిగా కల్లూరు పీరా, కార్యదర్శిగా సుధాకర్, సహాయ కార్యదర్శిగా మహేష్, కోశాధికారిగా లోకేష్, గౌరవ సలహాదారులు ఎంపికైనట్లు ఎన్నుకున్నట్లు ఉపాధ్యక్షుడు పీరా తెలిపారు.

వ్యవసాయ కూలీ దుర్మరణం



పుల్లయ్య(48)

గార్లదిన్నె, న్యూస్‌టుడే: గార్లదిన్నె మండలంలోని కల్లూరు సమీపంలో 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ కూలీ పుల్లయ్య(48) మృతిచెందాడు. ఈఘటన సోమవారం జరిగింది. పాతకల్లూరుకు చెందిన పుల్లయ్య రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వేగంగా వెళ్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం చికిత్స కోసం 108వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కారు డ్రైవర్ అజీమ్ సల్మాన్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రంగనాథస్వామి ఆలయ అభివృద్ధికి కృషి

గుత్తి గ్రామీణం: ఆలయ కమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధికి పని చేయాలని గుత్తి తెదేపా బాధ్యుడు గుమ్మనూరు నారాయణ పేర్కొన్నారు. సోమవారం తొండపాడు గ్రామంలో ఆలయ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా గ్రామసభ

యల్లనూరు, న్యూస్‌టుడే: వేములపల్లెలో సోమవారం పౌర హక్కులపై నిర్వహించిన గ్రామసభలో అధికారులే ఎక్కువగా ఉండడం, ప్రజలు అందుబాటులో లేక పోవడం కనిపించింది. అధికారులు అగ్రకుల కూడా కార్యక్రమాన్ని నిర్వహించే పరిస్థితి లేక పోవడంతో గ్రామసభ పరిస్థితిని చూసి పలువురు ప్రజలు విమర్శిస్తున్నారు. ముందస్తుగా సమాచారం లేకపోవడంతోనే ప్రజలు హాజరుకాలేదు. డిప్యూటీ తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఆర్ఐ చిన్ననారాయణమ్మ, సీనియర్ అసిస్టెంట్ వసంతరావు, ఎస్ఐ శ్రీనివాసగౌడ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ



వెంకటాంపల్లిలో ములకంపల మధ్య నిరుపయోగంగా మరుగుదొడ్డి

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల వద్ద చిన్నారులకు, సిబ్బందికి ఉపయోగపడేలా తాగునీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరించారు. ప్రస్తుత తెదేపా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల వద్ద సమస్యలకు పరిష్కారం చూపే దిశగా అడుగులు వేస్తోంది. ప్రధానంగా చిన్నారుల తాగునీటి సౌకర్యం, వినియోగానికి మరుగుదొడ్ల నిర్మాణం కోసం ఒక్కో కేంద్రానికి రూ.17 వేలు మంజూరు చేసింది.

మరుగుదొడ్లు, నీటి సౌకర్యానికి నిధులు

ఎక్కడెక్కడంటే?

నియోజకవర్గంలోని గుత్తిలో 26, గుంతకల్లు 19, పామిడిలో 21 కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు నిధులు మంజూరు చేసింది. మొత్తంగా నియోజకవర్గంలో తాగునీటి సౌకర్యం 75 కేంద్రాలు, మరుగుదొడ్ల నిర్మాణాలు 64 కేంద్రాల్లో ఏర్పాటు చేసేందుకు నిధుల మంజూరు చేయడంతో అంగన్‌వాడీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే పనులు -దీప్తిశ్రీ, సీడీపీవో, ఐసీడీఎస్

అంగన్‌వాడీ కేంద్రాల వద్ద తాగునీటి, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించేందుకు తెదేపా ప్రభుత్వం ఆరోగ్యబ్య ఎస్‌కు అనుసంధానం చేసి నిధులు కేటాయించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

మడుగు కాదు.. రోడ్డే



శింగనమల మండలం లోలూరు నుంచి మదిరేపల్లికి వెళ్లే రోడ్డుపై అడుగుకొక గుంత ఏర్పడింది. ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బెంగళూరు- హైదరాబాద్ జాతీయ రహదారికి పక్కనే ఉన్న ఈ రోడ్డు గుంతలమయంగా మారింది. లోలూరు పాఠశాల వద్ద, ఆకులేడు గ్రామంలో, మదిరేపల్లికి వెళ్లే ప్రధాన రోడ్డు గుంతలు పడ్డాయి. వర్షం వస్తే ఈ గుంతలు మడుగును తలపిస్తున్నాయి. ఈ విషయమై ఆర్అండ్‌బీ జేఈ మూర్తిని వివరణ కోరగా రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపుతున్నామని, త్వరలోనే పనులు చేస్తామని వివరించారు. -న్యూస్‌టుడే, శింగనమల

పనులు చేయకుండా కాలయాపన తగదు



పురపాలక అధ్యక్షురాలు భవానీకి సమస్యలు వివరిస్తున్న కౌన్సిలర్ పవన్‌గౌడ్

గుంతకల్లు, న్యూస్‌టుడే: పనులు దక్కించుకున్న గుత్తేదారులు పనులు చేయకుండా నెలల తరబడి కాలయాపన చేస్తుంటే అధికారులు మౌనంగా ఉండటం న్యాయం కాదని తెదేపా కౌన్సిలర్ పవన్‌గౌడ్ అన్నారు. సోమవారం కౌన్సిల్ సమావేశ మందిరంలో కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని అధ్యక్షురాలు భవానీ అధ్యక్షతన నిర్వహించారు. పట్టణంలో రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, పైపైన్లు ఏర్పాటు తదితర పనులకు టెండర్లను నిర్వహించి గుత్తేదారులకు పనులను అప్పగిస్తే కౌన్సిల్‌లో తీర్మానాలు చేసినా ప్రయోజనం లేకుండా పోతోందన్నారు. గుత్తేదారులపై చర్యలు తీసుకుని పనులను ప్రారంభించే విధంగా చూడాలన్నారు. ప్రజలకు రెండు రోజులకోసారి తాగునీరు వచ్చేలా చూడాలని కౌన్సిలర్ కృపాకర్ కోరారు. ముళ్లపొదలు తొలగించాలని నిధులు కేటాయించి బదులుగా జేసీబీలు కొనుగోలు చేయాలన్నారు. లేఅవుట్ స్థలాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు. సహాయ కమిషనర్ లావణ్య, పట్టణ ప్రణాళికాధికారి అబ్దుల్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

పామిడి అభివృద్ధి పట్టదా?

పామిడి, న్యూస్‌టుడే: పామిడి గ్రామపంచాయతీకి రావాల్సిన సంక్షేమ పథకాల నిధులు అందకపోవడంతో పామిడి అభివృద్ధికి ఆమడ దూరంగా ఉందని సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఎమ్మార్పీఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. జీవోనం:137 ప్రకారం గ్రామపంచాయతీగా కొనసాగుతున్న ఉపాధిహామీ పనులు చేపట్టక పోవడం, బీజీఆర్ఎఫ్, ఆర్థిక ప్రణాళిక నిధులు అందకపోవడంతో పనులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కుమారస్వామి, మల్లికార్జున, వెంకట, ఎంసీ సుంకన్న, గోపాల్, రామాంజనేయులు పాల్గొన్నారు.

'పెద్దారెడ్డిని తాడిపత్రికి రానివ్వం'

తాడిపత్రి, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చినా, రాకపోయినా ఫ్యాక్షన్‌ను ప్రారంభిస్తానని ఎన్నార్లు బహిరంగంగానే మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రకటించారని, దీనికి గాను ఆయన్ని పట్టణంలోకి అడుగు పెట్టనివ్వమని తెదేపా కౌన్సిలర్ మల్లికార్జున పేర్కొన్నారు. సోమవారం ఆయన సామాజిక మాధ్యమాల వేదికగా చేసుకుని మాట్లాడారు. పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తే శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని, అందుకు ఆయన వస్తే పోలీసుల కంటే తామే ముందు అడ్డుకుంటామన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరుడు రవీంద్రారెడ్డిని 5 ఏళ్లపాటు అక్రమంగా తాడిపత్రికి రానివ్వలేదని, కోర్టుల అనుమతి, మానవహక్కుల సంఘాల వద్దకు వెళ్లినా అప్పటి డీఎస్పీ చైతన్యను అడ్డం పెట్టుకుని రానివ్వలేదన్నారు. త్వరలోనే జిల్లా ఎస్పీని కలిసి ఐదేళ్లలో పెద్దారెడ్డి చేసిన అక్రమాల గురించి తెలియజేస్తామన్నారు.

సొంతూరికి వెళ్లడానికి పోలీసు ఆంక్షలా?

అనంత నేరవార్తలు: తెదేపా అధికారంలోకి వచ్చాక దౌర్జన్యాలు, అక్రమాలు పెరిగాయని.. తన సొంతూరు తాడిపత్రికి వెళ్లాలన్నా పోలీసుల ఆంక్షలు విధిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి అన్నారు. ఆయన ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఎస్పీ జగదీశ్‌ను కలిశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'తాడిపత్రి పోవడానికి అనుమతి ఇవ్వాలని ఇప్పటి వరకు ఎంతో మంది ఎస్పీలను కోరాను. ఆలోచిస్తాయంటున్నారే తప్ప అనుమతి ఇవ్వడం లేదు. వైకాపా హయాంలో తాడిపత్రి నియోజకవర్గంలో పర్యటిస్తానని ఎన్నో చెప్పాను. తాడిపత్రితో పాటు జిల్లాలో మట్కా, గంజాయి, లిక్కర్ విక్రయాలు అధికంగా ఉన్నాయని' ఆరోపించారు.

జగనన్న కాలనీ.. సమస్యలే అన్నీ



అసంపూర్తిగా నిర్మాణం

అసౌకర్యాలతో తప్పని తిప్పలు

యాడికి, న్యూస్‌టుడే: యాడికి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలపై పురోగతి కానరావడం లేదు. అడుగడుగునా సమస్యలతో లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు అప్పులు తెచ్చి కట్టుకుంటుండగా, మరి కొందరు బిల్లులు రాకపోవడంతో మధ్యలోనే ఆపేశారు. మరి కొందరికి గుత్తేదారు చేతులెత్తేయడంతో పైకప్పు స్థాయిలోనే ఆగిపోయాయి. ఇంటి బాధ్యలు చెల్లించలేక అరకొరగా పూర్తి అయిన ఇళ్లలోకి చేరిన లబ్ధిదారులకు నీళ్లు, విద్యుత్తు, రోడ్లు తదితర సమస్యలు వెంటాడుతున్నాయి. నీటి సమస్య వేధిస్తోంది.

ఇళ్ల నిర్మాణాల పరిస్థితి

యాడికి పట్టణంలోని రెండు లేఅవుట్లలో 332 గృహాలు మంజూరయ్యాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో కేవలం 20 మాత్రమే పూర్తిగా, దాదాపు 120 మంది ఇంకా మొదలు పెట్టలేదు. ప్రస్తుతం బేస్‌మట్టం వరకు 40, గోడల లెవల్‌లో ఆరు, పైకప్పు వరకు ఆరు ఉన్నాయి. బేస్‌మట్టం వేసి ఇంకా ఇళ్లు మంజూరు కాలేదని అధికారులు చెబుతున్నట్లు ఉమాదేవి అనే బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు.

• ఆప్షన్ 3 కింద ఎంపిక చేసుకున్న లబ్ధిదారులకు గుత్తేదారు నుంచి బిల్లుల చెల్లింపులు జరగడం లేదు. గుత్తేదారుడే ఇళ్లు నిర్మించి ఇచ్చేలా ఒప్పందం చేసుకోవడంతో ఒక్కో లబ్ధిదారుడి నుంచి అదనంగా రూ.35 వేల ప్రకారం 47 మందితో డబ్బులు వసూలు చేశారు. ఒప్పందం ప్రకారం గుత్తేదారు ఇళ్లు కట్టలేక చేతులెత్తేశారు.

లబ్ధిదారులకు న్యాయం చేస్తాం

- ప్రశాంత్‌కుమార్, ఏఈ, గృహనిర్మాణ శాఖ, యాడికి

సంబంధిత గుత్తేదారుతో మాట్లాడాం. ఇది వరకే కొంత మొత్తం చెల్లించేలా చేశాం. మిగిలిన లబ్ధిదారులకు కట్టిన మొత్తాలను అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

అనంతపురం

• అనంతపురం • రాప్తాడు

భూ సేకరణలో అలసత్వం తగదు: కలెక్టర్

జిల్లా సచివాలయం: జిల్లాలో వివిధ శాఖలకు అప్పగించేందుకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియ వేగవంతంగా సాగాలి. క్షేత్రస్థాయిలో అలసత్వం చూపొద్దని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో అధికారులతో సమీక్ష జరిపారు. ఎన్‌హెచ్ 544డీ, విద్యుత్తు, రైల్వే, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, జెన్కో, ఏపీఐఐసీ, వంటి ప్రాజెక్టులు, శాఖలకు తగిన భూమి అవసరం. ఎక్కడికక్కడ తగిన భూ సేకరణ చేసి వారికి అప్పగించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జేసీ శివనారాయణ శర్మ, డీఆర్ఓ రామకృష్ణారెడ్డి, ఎన్‌హెచ్ఏఐ పీడీ తరుణ్‌కుమార్, మేనేజర్ మురళీ, ఆర్ అండ్‌బీ ఈఈ సుధాకర్‌రెడ్డి, ఏఈ రాఘవేంద్రరావు, కలెక్టరేట్ పర్యవేక్షకుడు రియాజుద్దీన్, తహసీల్దార్లు బాలాజీ, పుణ్యవతి, పవర్‌గ్రిడ్ డీజీఎంలు రవికుమార్, వెంకటన్న, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలకు స్టేషనరీ

అనంత నగరపాలక, న్యూస్‌టుడే : సచివాలయాలు మానస పుత్రికలు అంటూ వైకాపా ప్రభుత్వ పెద్దలు పదే పదే చెబుతూ వాటిని పూర్తిగా విస్మరించారు. గత ఐదేళ్లలో కనీసం తెల్ల కాగితం ఇవ్వలేదు. ఉద్యోగులే చందాలు వేసుకొని స్టేషనరీ కొనేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి పలు రకాల స్టేషనరీ అందించడంతో ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలోలాగ తెల్ల కాగితం జీతంలో తీసి కొనుగోలు చేసే దయనీయ పరిస్థితి ఉండదని వ్యాఖ్యానించారు. నగరంలోని 74 సచివాలయాలకు సోమవారం తెల్ల కాగితాలతో పాటు ఇంకు సీసాలు, ర్యాపర్లు, స్టాంపు ప్యాడ్లు, స్టాప్లర్లు, స్టాప్లర్ పిన్నులు అందజేశారు. రూ. 4.95లక్షల విలువ చేసే స్టేషనరీని టెండర్లు పిలిచి రికార్డు విభాగానికి అందజేయడంతో వాటిని సరఫరా చేశారు.

స్వాహా సొమ్ము రికవరీ చేయిస్తాం

అనంత సంక్షేమం: కళ్యాణదుర్గం మండలం మల్లికార్జునపల్లిలోని నరసింహస్వామి గ్రామ సంఘంలో స్వాహా చేసిన రూ. 72,41,307 నిధులను రికవరీ చేయిస్తామని డీఆర్‌డీఏ-వెలుగు ప్రాజెక్టు డైరెక్టరు సి. ఓబుళమ్మ పేర్కొన్నారు. సోమవారం 'ఈనాడులో' 'అధికారం అండగా.. అడ్డంగా మేసేశారు' శీర్షికన కథనం ప్రచురితమైంది. నిధుల దుర్వినియోగ సమయంలో అధికారుల పర్యవేక్షణ లోపం, సదరు సిబ్బందిని బాధ్యులను చేస్తూ రికవరీ చేయించాలని నిర్ణయించామన్నారు. ఈ మేరకు వారందరికీ తాఖీదులు జారీ చేశామన్నారు.

నైపుణ్యాల సద్వినియోగంతో భవిష్యత్తు

ఎస్కేయూ: పాలిటెక్నిక్ విద్యార్థులు నైపుణ్యాలను సద్వినియోగం చేసుకొంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కెరీర్ మార్గదర్శకులు విజయకృష్ణ అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు కెరీర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రిన్సిపల్ జయచంద్రారెడ్డి, రామాంజనేయులు, అధ్యాపకులు సుదాకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, రమాకాంత్, ఓంకార్ పాల్గొన్నారు.

నీరందక బోరుమంటున్నారు

- తరచూ కాలిపోతున్న మోటార్లు
- మరమ్మతుల్లో నగరపాలక నిర్లక్ష్యం

✤ నగర జనాభా: 3,46,262
✤ బోర్ల ద్వారా నీటి సరఫరా: 0.60 ఎంఎల్‌డీ
✤ నిత్యం నీరుసరఫరా అయ్యే డివిజన్లు: 23
✤ రోజు మార్చి రోజు: 27
✤ నగరంలో ఉన్న పవర్ బోర్లు: 170
✤ బోర్లు పని చేయని కాలనీలు: రాణినగర్, హరిజనవాడ, ఫెర్రర్‌కాలనీకి, బ్రహ్మంగారి గుడి వద్ద, సాయినగర్, ప్రకాశ్‌రోడ్డు
✤ నీరుగంటి వీధిలో కొత్త పైపులైను వేయాల్సి ఉంది. టెండర్లు పిలిచి ఏడాది అవుతున్నా అతీగతీలేదు.



అనంత నగరపాలక, న్యూస్‌టుడే: నగరానికి ప్రధాన నీటి వనరు పెన్నహోబిలం జలాశయం. దాంతోపాటు కొన్ని కాలనీలకు బోర్ల ద్వారా పైపులైన్లు ఏర్పాటు చేసి సరఫరా చేస్తున్నారు. ఈ నీటితో ప్రజలు అవసరాలు తీర్చుకునేవారు. అయితే పలు ప్రాంతాల్లో మోటార్లు కాలిపోయి నెలలు గడుస్తోంది. మరమ్మతులు చేసేందుకు నగరపాలక తాగునీటి ఇంజినీరింగ్ విభాగం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. నీరు పుష్కలంగా ఉన్నా.. రూ. కోట్లు ఖర్చు చేస్తున్నా ప్రజలకు సరిపడా తాగునీరు అందడం లేదు. మోటార్లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



పని చేయని బోరును చూపుతున్న మహిళలు

ఆరునెలలుగా నిరుపయోగం



ప్రకాశ్‌రోడ్డులో దిష్టిబొమ్మలా బోరు, ట్యాంకు

ప్రకాశ్‌రోడ్డులో పవర్ బోరు ద్వారా ట్యాంకును నింపితే కుళాయిలకు నీరు వెళతాయి. ఆరు నెలల కిందట బోరులో రాళ్లు వేశారు. అప్పటి నుంచి మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. ట్యాంకు, పైపులైను వృథాగా పడి ఉంది. నీరందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

మరమ్మతులు చేస్తాం

నగరంలో పని చేయని పవర్ బోర్లకు మరమ్మతులు చేస్తాం. కొత్త మోటార్లు ఏర్పాటు చేయాల్సిన చోట కొంత ఆలస్యం అవుతుంది. చిన్న చిన్న పనులు పూర్తి చేసి నీరందిస్తాం.

- చంద్రశేఖర్, తాగు నీటి విభాగం డీఈ

పట్టించుకునేవారేరీ?

సాయినగర్‌లో పవర్ బోర్లు తరచూ కాలిపోతున్నాయి. మోటార్లు ఆన్, ఆఫ్ చేసే ఉద్యోగి రావడం లేదు. గంటల తరబడి అవి పని చేస్తున్నాయి. ప్రస్తుతం రెండు మోటార్లు పని చేయడం లేదు. బోరు ఉన్నా ప్రయోజనం లేకుండా ఉంది. నగరపాలక తాగునీటి విభాగం అధికారులు సదరు ఉద్యోగిపై చర్యలు తీసుకోవడం లేదు. పది రోజులవుతున్నా మోటార్లకు మరమ్మతులు చేపట్టడం లేదు. తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

అనంత నగరపాలక: 8008573011, రూరల్: 8008573010, రుద్రంపేట: 9989195979, ఎస్కేయూ: 8008573005
రాప్తాడు: 6304766286, ఆత్మకూరు: 7995067003

సమస్య: కోవూరునగర్‌లో రోడ్డుకు ఇరువైపులా పడిన చెత్తను తొలగించాలి. **- నాగభూషణం**

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి తొలగిస్తాం.

సమస్య: వినాయకనగర్‌లో ఎన్టీఆర్ మార్గ్ సమీపంలో వీధి లైట్లు వెలగడం లేదు. **- మహేశ్**

సమాధానం: వెలిగేలా చర్యలు చేపడతాం.

(పై ప్రశ్నలకు నగరపాలక డీఈ దాక్షాయిణి, ప్రజారోగ్య అధికారి విష్ణుమూర్తి సమాధానాలు చెప్పారు.) **- న్యూస్‌టుడే, అనంత నగరపాలక**

సమస్య: హౌసింగ్‌బోర్డు కాలనీలో ఎల్ఐజీ బస్టాప్ సమీపంలోని కాలువను శుభ్రం చేయాలి. **- శ్రీనివాసచౌదరి**

సమాధానం: శుభ్రం చేయిస్తాం. **- విష్ణుమూర్తి, నగరపాలక ఎంహెచ్ఓ**

- న్యూస్‌టుడే, కమలానగర్

మురుగు, చెత్త తొలగింపు

అనంతపురం (వ్యవసాయం): స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుభ్రత పాటించారు. గత నెల 30న 'అపరిశుభ్రంగా అనంత మార్కెట్ యార్డు' శీర్షికన కథనం ప్రచురితమైంది. యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు స్పందించారు. గ్రేడ్-2 కార్యదర్శి రూపకుమార్, ఉద్యోగులు, సిబ్బందితో యార్డంతా చెత్తాచెదారాన్ని ఊడ్చారు. మురుగు నీరు బయటకు పోయేలా చేశారు. యార్డును శుభ్రంగా ఉంచాలని పండ్ల వ్యాపారులు, చీనీ మండీ వ్యాపారులకు, రైతులకు సూచించారు.

విధుల్లో జవాబుదారీతనం ఉండాలి

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: విధుల్లో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు. అనంతపురం పోలీసు కాన్ఫరెన్సు హాల్లో సోమవారం జిల్లాలోని ఎస్సై, ఆపై స్థాయి పోలీసు అధికారులతో ఎస్పీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. తీవ్రమైన కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చర్యలుండాలన్నారు. ప్రతీ పోలీసు స్టేషనులో జనరల్ జి.డిలు తప్పరిసరిగా రాయాలన్నారు. లాకప్ గదులు క్లియర్‌గా ఉంచుకోవాలన్నారు. అనంతరం గత నెలలో జిల్లా వ్యాప్తంగా మంచి పని తీరు కనబరిచిన 46 మంది పోలీసులను ఎస్పీ అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. పలు కేసుల చేదనలో శ్రమించిన సీఐలు ఇస్మాయిల్, సాయినాథ్, ప్రతాప్‌రెడ్డి, షేక్ జాకీర్, ఎస్సైలు నాగమధు, సాగర్, గౌస్ మహమ్మద్, పవన్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డిలు, ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను అభినందించారు.



సీఐ సాయినాథ్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ జగదీశ్

సకాలంలో రేషన్ సరకుల పంపిణీకి చర్యలు

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లాలో కార్డుదారులకు సకాలంలో రేషన్ సరకులు అందేలా చర్యలు తీసుకుంటామని నూతన జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. సోమవారం ఆశాఖ కార్యాలయంలో ఇన్‌ఛార్జి డీఎస్‌వో శోభారాణి నుంచి బాధ్యతలు తీసుకున్నారు. అంతకు ముందు కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివనారాయణశర్మను మర్యాద పూర్వకంగా కలిశారు.



డీఎస్‌వో వెంకటేశ్వర్లు



ఉద్యోగులతో కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివనారాయణ శర్మ, డీఆర్ఓ రామకృష్ణారెడ్డి

పదవీ విరమణ ఉద్యోగులకు సత్కారం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: దాదాపు నాలుగు దశాబ్దాలు ప్రజా జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని పని చేశారు. శేష జీవితం హాయిగా.. కుటుంబంతో ఆనందంగా గడపాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆకాంక్షించారు. సోమవారం అనంత కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో అన్ని శాఖల్లో పదవీ విరమణ పొందిన అధికారులు, ఉద్యోగులకు సామూహిక సత్కారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తోటు జేసీ శివనారాయణ శర్మ మాట్లాడారు. ఉద్యోగ నిర్వహణలో ప్రతి ఒక్కరూ పదవీ విరమణ పొందక తప్పదన్నారు. సోమవారం 21 మంది పదవీ విరమణ పొందారు. 15మంది ఈ సత్కార కార్యక్రమానికి హాజరయ్యారు. వీరికి ఒక మొక్క, జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్ఓ రామకృష్ణారెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆగిన పనులు వేగవంతం చేయండి

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: నగరంలో ఆగిపోయిన పనులను పరుగులు పెట్టించాలని మేయర్ వసీం అధికారులకు సూచించారు. సోమవారం నగరపాలకలోని ఆయన ఛాంబర్లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనరు, ఈఈలు రాధాకృష్ణ, షాకీర్ హుస్సేన్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్‌కు ఈఈలు పుష్పగుచ్ఛం అందజేసి మర్యాద పూర్వకంగా కలిశారు. నగరంలో టెండర్లు పిలిచి వర్కు ఆర్డర్ ఇవ్వని రూ. 13.80 కోట్ల పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. కుక్కల బెడద లేకుండా చూడాలన్నారు. దసరా సందర్భంగా శ్మశాన వాటికల్లో శుభ్రత చర్యలు చేపట్టాలన్నారు.



మేయర్ వసీంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనరు నాగరాజు, ఈఈలు

నిందితుల అరెస్టులో నిబంధనలు పాటించాలి

అనంతపురం(లీగల్), న్యూస్‌టుడే: నిందితుల అరెస్టు, రిమాండు సమయంలో పోలీసులు నిబంధనలు పాటించాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, న్యాయమూర్తి శివప్రసాద్‌యాదవ్ సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో సోమవారం పోలీసులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ముందస్తు అరెస్టుల సమయంలోనూ జాగ్రత్తలు పాటించాలన్నారు. పోక్సో చట్టం అమలుపై సంపూర్ణ అవగాహన ఉండాలన్నారు. లైంగిక వేధింపుల నుంచి బయటపడిన బాధితులకు పరిహారం అందేలా చూడాలన్నారు. దీనిపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ చీఫ్ నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి శివప్రసాద్‌యాదవ్

ముద్ద దిగదు.. నీరు అందదు

నగరంలోని రాంనగర్‌లో ఉన్న బీసీ సంక్షేమ వసతి గృహంలో కనీస వసతులు లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఇక్కడ ఇంటర్, డిగ్రీ విద్యార్థులు 180 మంది వరకు ఉన్నారు. సోమవారం ఉదయం విద్యుత్తు సరఫరా లేకపోవడంతో తాగేందుకు, స్నానానికి, బాత్‌రూంలకు నీటి సరఫరా పూర్తిగా ఆగిపోయింది. విద్యార్థులు నానా తంటాలు పడ్డారు. కొందరు సాహసం చేసి సంపులోని నీటిని తోడి పైఅంతస్థులోకి తీసుకెళ్లారు. సౌకర్యాలను పర్యవేక్షించాల్సిన వార్డెన్, సిబ్బంది ఎవరూ అందుబాటులో లేకపోవడం గమనార్హం. వసతి గృహ ప్రాంగణం, పరిసరాల్లో తీవ్ర అపరిశుభ్రత నెలకొంది.

- న్యూస్‌టుడే, అనంత సంక్షేమం



సంపులో నీటిని తోడుకుంటున్న విద్యార్థి

అన్నం రుచిగా లేకపోవడంతో పారబోత

సొంతూరికి పోవడానికి పోలీసు ఆంక్షలా?

- మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: తెదేపా అధికారంలోకి వచ్చాక దౌర్జన్యాలు, అక్రమాలు పెరిగాయని.. తన సొంతూరు తాడిపత్రికి వెళ్లాలన్నా పోలీసులు ఆంక్షలు విధిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. సోమవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ జగదీశ్‌ను కలిశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'తాడిపత్రి పోవడానికి అనుమతి ఇవ్వాలని ఇప్పటి వరకు ఎంతో మంది ఎస్పీలను కోరాను. ఆలోచిస్తాంటున్నారే తప్ప అడ్డుపడం అని చెప్పడం లేదు. దసరా తర్వాత తాడిపత్రి నియోజకవర్గంలో పర్యటిస్తానని ఎస్పీకి చెప్పాను. తాడిపత్రితో పాటు జిల్లాలో మట్కా, గంజాయి, లిక్కర్ విక్రయాలు అధికంగా ఉన్నాయని' ఆరోపించారు. వీటిపై ప్రభుత్వం పట్టించుకోకపోతే రోడ్డుపైకి వచ్చి నిరసన తెలుపుతామన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

అనంత నేరవార్తలు: నగరంలోని ఎంజీ కాలనీకి చెందిన పార్వతి(49) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందింది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆదివారం రాత్రి బంధువు రామాంజనేయులుతో కలిసి ద్విచక్రవాహనంపై ఆసుపత్రికి వెళ్తుండగా కిందపడింది. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు

శ్రీధర్‌రావు సేవలు మరువలేనివి

కమలానగర్: ప్రభుత్వ వైద్య కళాశాల, సర్వజన ఆసుపత్రిలో ఆచార్య డాక్టర్ శ్రీధర్‌రావు అందించిన సేవలు మరువలేనివని ప్రిన్సిపల్ ఆచార్య డాక్టర్ మాణిక్యరావు, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు కొనియాడారు. శ్రీధర్‌రావు పదవి విరమణ పొందారు. సోమవారం సమావేశ భవనంలో ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో శ్రీధర్‌రావు, శైల దంపతులను సన్మానించి, జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రామస్వామినాయక్, సూపరింటెండెంట్ నవీద్ అహ్మద్, వైస్ ప్రిన్సిపల్ నవీన్‌కుమార్, షారోన్ సోనియా, శంషాద్‌బేగం తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ శ్రీధర్‌రావు దంపతులను సన్మానిస్తున్న వైద్యులు

'ఉద్యోగులపై డీఈవో వివక్ష'

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: రిజర్వేషన్ వర్గాల ఉద్యోగులపై డీఈవో వివక్ష చూపుతున్నారని ఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర ఆరోపించారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. డీఈవో వైఖరితో ఎస్సీ, ఎస్టీ వర్గాల ఉపాధ్యాయులు అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్రశిక్షా కార్యాలయంలో సెక్టోరియల్ పోస్టుల మౌఖిక పరీక్షల్లో కూడా అన్యాయం చేశారని ఆరోపించారు. డీఈవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హెచ్చెల్సీ కట్టపై జాగ్రత్త



నగరంలోని హెచ్చెల్సీలో నీరు పారుతున్నాయి. అయితే ఇందిరా నగర్ నుంచి జాతీయ రహదారిపైకి ద్విచక్ర వాహనదారులు కాలువ కట్టపై నుంచి వెళ్తున్నారు. ఈ దారిలోని వంతెనకు రక్షణ గోడలు విరిగిపోయాయి. ఏమాత్రం అజాగ్రత్తగా వాహనం నడిపినా నేరుగా కాలువలో పడే ప్రమాదం ఉంది.

- ఈనాడు, అనంతపురం

ప్రమాదాలకు కంచె



నగరంలో సైపుల్లా వంతెన పక్కన ఉన్న చిన్న పాటి దారి నుంచి వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఆ పక్కనే మురుగుకాలువపై వేసిన ఇనుప కంచె శిథిలమై ప్రమాదకరంగా మారింది. అది వాహనాలకు తగులుతుండటంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

- ఈనాడు, అనంతపురం

చెత్తకుండీ.. పక్కకు జరపండి

నగరంలోని ఏజీఎస్ రెడ్డి కాలనీలో టీటీడీ కల్యాణ మంటపం సమీపంలో మున్సిపల్ అధికారులు చెత్తకుండీని నడిరోడ్డుపై ఏర్పాటు చేశారు. రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రివేళ కొందరు గమనించకుండా దాన్ని ఢీకొట్టి కిందపడిన ఘటనలు ఉన్నాయి. సంబంధిత అధికారులు కుండీని పక్కకు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఆజాద్‌నగర్(అనంతపురం)



వేళలు పాటించరే..?



ఆత్మకూరు మండలంలోని సనప సచివాలయ సిబ్బంది వేళలు పాటించడం లేదు. సోమవారం ఉదయం 10:30 గంటలైనా ఎవరూ హాజరు కాలేదు. కార్యాలయానికి తాళం వేసి ఉండటంతో ప్రజలు వచ్చి వెళుతున్నారు. అధికారులు, సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

- న్యూస్‌టుడే, ఆత్మకూరు

పోటీలకు విశేష స్పందన

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: విద్యాశాఖ, జిల్లా వైద్యఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలకు విశేష స్పందన లభించింది. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ, పరీక్షల నిషేధ చట్టం, బాల్యవివాహాల అరికట్టడంలో సమాజ పాత్ర అనే అంశాలపై జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ, గోడపత్రాల ప్రదర్శన, పాటలు, నాటికల పోటీలు నిర్వహించారు. 314 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు



డీఈవో వరలక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: పురపాలక పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. డీఈవో వరలక్ష్మికి సోమవారం వినతి పత్రం అందించారు. ఆ సంఘం నాయకులు కోటేశ్వరప్ప, లింగమయ్య మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలలు విద్యాశాఖలో విలీనమైనా ఉపాధ్యాయుల సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. పదోన్నతులు, బదిలీలు, జీపీఎఫ్ తదితర సమస్యలపై ఉద్యమ కార్యాచరణ రూపొందించామన్నారు. అక్టోబరు 2 నుంచి ఉద్యమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రమణయ్య, సుబ్బారాయుడు, కొండప్ప, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఆదర్శ విద్యార్థులు

రాప్తాడు, న్యూస్‌టుడే: ఏపీ స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పద్మజదేవి, పీడీ మల్లికార్జున తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను సోమవారం ఉపాధ్యాయులు అభినందించారు. అండర్-19 సాఫ్ట్ బాల్ విభాగంలో చరణ్, సాయికుమార్, సి. చరణ్, మనోజ్‌కుమార్ ఎంపికయ్యారు. బేస్‌బాల్ విభాగంలో వరుణ్, మనోహర్, బాల్‌బ్యాడ్మింటన్ విభాగంలో మనోజ్‌కుమార్, అండర్-17 టెన్నిస్‌లో త్రిపాల్, కార్తీక్ ఎంపికయ్యారు.

నందమూరినగర్: రాష్ట్రస్థాయి ఏడో జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు అనంతపురం గ్రామీణం సెయింట్ ఆన్స్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సాయికుమార్ ఎంపికయ్యాడు. ఈ నెల 6, 7 తేదీల్లో కర్నూలు జిల్లా బెళగల్ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. ప్రిన్సిపల్ సెల్వమేరీ, సిస్టర్లు మాధవి, సాగరీమేరీ, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ పద్మజదేవి, పీడీ మల్లికార్జున

కబ్జాదారులపై చర్యలకు డిమాండ్

ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వంలో నగరంలోని ప్రభుత్వ స్థలాలు యథేచ్ఛగా కబ్జా చేశారని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని నీలం రాజశేఖర్ రెడ్డి భవనంలో ఆయన విలేకరుల సమావేశంలో సహాయ కార్యదర్శులు అల్లీపీరా, రమణయ్యతో కలిసి మాట్లాడారు. నగరం నడిబొడ్డున ఉన్న రూ. కోట్లు విలువ చేసే సెంట్రల్ పార్కు స్థలం సుమారు ఒకటిన్నర ఎకరా ఆక్రమణకు గురైందని ఆరోపించారు. అందులో వైకాపా నాయకులు కట్టడాలు నిర్మించారన్నారు. 353 సర్వే నంబరులో శ్రీనగర్‌కాలనీలో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి సోదరుడు 3 సెంట్ల స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టాడని ఆరోపించారు. ఖాజానగర్, శ్రీనివాసనగర్‌లలో కూడా ఆక్రమించుకుని పట్టాలు తెచ్చుకున్నారన్నారు. కబ్జాలపై కార్పొరేషన్ మంత్రి, అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు.

రహదారి.. రూపు చెదిరి

- గత ఐదేళ్లలో కనీస మరమ్మతులు కరవు



ఆత్మకూరు నుంచి పి.యాలేరు మార్గంలో తారు పోయి మిగిలిన మట్టిరోడ్డు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రహదారులు గుంతలు పడి దారుణంగా మారాయి. వర్షం వస్తే ఏ గుంత ఎక్కడుందో తెలుసుకోవడం కష్టమే. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం కనీసం మరమ్మతులు చేపట్టలేదు. కేవలం ప్రచారాలతో సరిపెట్టారు. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో సనప-వేపచెర్ల, ఆత్మకూరు, ముట్టాల, గొరిదిండ్ల గ్రామాలకు తారు రోడ్లు నిర్మించారు. పి. కొత్తపల్లి, పాపంపల్లి, కుర్లపల్లి, వడ్డుపల్లి-మదిగుబ్బ గ్రామాలకు బీటీరోడ్డు నిర్మాణానికి అనుమతులు తీసుకున్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం రహదారులను పట్టించుకోలేదు.

ఉన్నతాధికారులకు నివేదించాం

మండలంలోని పలు గ్రామాలకు తారు రోడ్ల నిర్మాణానికి ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. కుర్లపల్లి, పి. కొత్తపల్లి గ్రామాలకు త్వరలోనే బీటీ రోడ్డు నిర్మించనున్నాం. నిధులు వచ్చిన వెంటనే దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయిస్తాం.

- పార్థసారథి, పంచాయతీ రాజ్ ఏఈ, ఆత్మకూరు

తారు వేయకుండానే వదిలేశారు

వడ్డుపల్లి-మదిగుబ్బ మధ్యలో మట్టి రోడ్డు వేశారు. దానిపై తారు వేయకుండానే వదిలేశారు. బి.యాలేరు నుంచి కనగానపల్లి మండలం తొగరగుంట వరకూ తారు రోడ్డు నిర్మాణం చేపట్టి మధ్యలోనే వదిలేశారు. పి. యాలేరు-ఆత్మకూరు 3కిలోమీటర్ల తారు రోడ్డుపై దాదాపు 60కిపైగా గుంతలు పడ్డాయి. అనేక చోట్ల తారు పోయి మట్టి మిగిలిపోయింది. తలుపూరు-వడ్డుపల్లి గ్రామాల మధ్య తారు రోడ్డు నిర్మాణాన్ని 2002లో చేపట్టారు. నాటి నుంచి మరమ్మతులు చేపట్టకపోవడంతో గుంతలు పడ్డాయి.



తలుపూరు-వడ్డుపల్లి మధ్య దెబ్బతిన్న తారురోడ్డు

గుంతల్లో నరకం



రాంనగర్‌లో రోడ్డు దుస్థితి

నగరంలోని రాంనగర్ సిద్ధార్థ పార్కు వద్ద అంతర్గత రోడ్డు ఇది. గుంతలు పడి వర్షం నీరు నిల్వ చేరాయి. ఈ మార్గంలో వెళ్లాలంటే ఒళ్లు హూనం అవుతుందని స్థానికులు వాపోతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఉద్యానవనానికి వచ్చే వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

- న్యూస్‌టుడే, అనంత నగరపాలక